RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 285 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 నవంబర్ 2024 బుధవారం పేజీలు : 4

## త్వరలో 'రైల్వే సూపర్ యాప్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ : రైల్వే సేవలన్నీ ఒకే చోట లభ్యమయ్యే 'సూపర్ యాప్' త్వరలో అందుబాటులోకి రానుంది. టిక్కెట్ల బుకింగ్, రిజర్వేషన్లు, ప్లాట్‌ఫారం టిక్కెట్లు, కేటరింగ్... తదితర సేవలన్నింటినీ సమన్వయపరిచి ఒకే యాప్ రూపంలో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. 'క్రిస్' సంస్థ ఈ నూతన యాప్ రూపకల్పనలో నిమగ్నమయింది. ఈ సమగ్ర మొబైల్ అప్లికేషన్ వచ్చే నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

ప్రస్తుతం ఐఆర్‌సీటీ సీ వెబ్‌సైట్ల ద్వారా ప్రయాణికులకు సేవలు అం దుతున్నాయి. ఒక్కో సేవకు ఒక్కో అప్లికేషన్ ఉండడంతో వాటన్నింటినీ సమన్వయపరిచి సమగ్రమైన యాప్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.




హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ అంశంపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సన్న ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించడం చరిత్రాత్మక కార్యక్రమమని ఉత్తమ్ అన్నారు. 2025 జనవరి నుంచి తెలంగాణ వ్యాప్తంగా రేషన్ కార్డు దారులందరికీ సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు. దీనిని దేశ చరిత్రలోనే ఓ మైలు రాయిగా అభివర్ణించారు. ధాన్యం సేకరణకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి గందరగోళం ఉత్పన్నం కాకుండా రైతులకు మద్దతివ్వడానికి ప్రజాప్రతినిధులు క్షేత్ర పర్యటనలు నిర్వహించాలని మంత్రి సూచించారు.





## తెలంగాణలో కులగణన దేశానికే ఆదర్శం: రాహుల్ గాంధీ

హైదరాబాద్: తెలంగాణలో జరిగే కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలనేది అధికారులు నిర్ణయించకూడదని, సామాన్యులే నిర్ణయించాలని చెప్పారు. బోయిన్‌పల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేధావులు, బీసీ సంఘాలతో రాహుల్ ముఖాముఖిగా మాట్లాడారు. కులవివక్ష, కులవ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. "దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందని అంగీకరిద్దాం. నేను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారు. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా? కులగణన ద్వారా దళితులు, ఓబీసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుంది. కులగణన తర్వాత ఎవరి దగ్గర ఎంత ఆర్థిక వనరులున్నాయో తెలుసుకుందాం. కులగణన చేస్తామని పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పాను. రిజర్వేషన్ల పరిమితిని తీసేస్తాం" అని రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం నుంచి కులగణన ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలకు సర్కార్ ఒంటిపూట బడులను ప్రకటించింది.

## నవంబర్ 7 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్: తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ.. దరఖాస్తుల స్వీకరణ ఆలస్యం కానుంది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఈ నెల 7 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. తెలంగాణలో సోమవారం టెట్ నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. తొలుత నవంబర్ 5 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించగా.. తాజాగా



మార్పులు చేశారు. 2025 జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం గతంలో పేర్కొంది. ఈ సంవత్సరం మే 20వ తేదీ నుంచి జూన్ 2 వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండో టెట్‌కు నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసి జనవరిలో పరీక్షలు జరుపుతామని గత ఆగస్టులో జాబ్ క్యాలెండర్ విడుదల సమయంలో ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది.

# ఇష్టం అంటే కుదరదు

## ప్రైవేట్ ఆస్తుల స్వాధీనం అసంభవం..!

## చారిత్రాత్మక తీర్పును వెల్లడించిన 'సుప్రీం'..




దిల్లీ: ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలులేదని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు ఈ తీర్పును ఇచ్చింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు మరో ఆరుగురు న్యాయమూర్తులు ఒకటి.. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సుధాన్షు ధూలియా వేర్వేరుగా మూడు తీర్పును రాశారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ ఎస్సీ శర్మ, జస్టిస్ ఏజీ మసీహ్ రాజ్యాంగ ధర్మాసనం పిటిషన్లపై విచారణ జరిపి తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి) ప్రకారం ప్రతి ప్రైవేటు ఆస్తిని కమ్యూనిటీ ఆస్తిలో భాగంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. చట్టాలు, విధానాల రూపకల్పనలో రాజ్యాంగం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రభుత్వాలు పాటించాలని ఈ ఆర్టికల్ చెబుతుందని.. ప్రైవేట్ యాజమాన్యంలోని ఆస్తులు ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవచ్చని.. కానీ, ఒక వ్యక్తికి చెందిన ప్రతి వనరునూ ఉమ్మడి ప్రయోజనంగా పరిగణించబడదని.. అది భౌతిక అవసరాలకు తగినదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దాంతో సుప్రీంకోర్టు 1978 నాటి ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 4:3 మెజారిటీతో ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వం అన్ని ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చని పేర్కొంది. ప్రత్యేక ఆర్థిక, సామ్యవాద భావజాలం స్ఫూర్తితో ప్రభుత్వం ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చని ఏడుగురు న్యాయమూర్తుల మెజారిటీ నిర్ణయం పేర్కొంది. సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పుతో ప్రైవేట్ యాజమాన్యాల యాజమాన్యంలోని అన్ని వనరులను ఇకపై ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలుండదు. సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనంలో ఇద్దరు న్యాయమూర్తులు భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. బెంచ్ నిర్ణయాన్ని జస్టిస్ బివి నాగరత్న పాక్షికంగా విభేదించగా.. జస్టిస్ సుధాన్షు ధులియా పూర్తిగా విభేదించారు. రాజ్యాంగం ప్రకారం, ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రైవేట్ యాజమాన్యంలోని అన్ని వనరులను స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వాలకు లేదని మంగళవారం 7:2 మెజారిటీ నిర్ణయంలో సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, కొన్ని కేసుల్లో ప్రభుత్వాలు ప్రైవేట్ ఆస్తులను క్లెయిమ్ చేసుకోవచ్చని సీజేఐ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం పేర్కొంది.



# రేషన్ కార్డు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు

## శుభవార్తే కానీ...

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు మరో శుభవార్త చెప్పింది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి క్లారిటీ ఇచ్చిన రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా మరొక శుభవార్తను చెప్పారు. ఇంతకాలం తెల్ల రేషన్ కార్డు ఉన్నవాళ్లకి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తారని ప్రచారం జరిగిన నేపథ్యంలో ఈ విషయం పైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టతనిచ్చారు.

**వీరికి ఇందిరమ్మ ఇళ్లిస్తాం...** రేషన్ కార్డు లేకపోయినా సరే మొదట విడతలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో పేదలు, నిరుపేదలను విభాగాలుగా పరిశీలించి వారికి తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్టుగా ఆయన తెలిపారు.

**రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ళకు రేషన్ కార్డు తప్పనిసరి...** అయితే రెండవ విడత నుంచి మాత్రం రేషన్ కార్డునే ప్రమాణికంగా తీసుకొని ఇల్లు మంజూరు చేస్తామని శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల జారీ ప్రక్రియ జరగలేదు. ఈ క్రమంలో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు మొదటి విడతలో చేయబోమని రేషన్ కార్డు లేని వాళ్ళు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**త్వరలోనే రేషన్ కార్డుల పంపిణీ :** ఇక త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అయితే రేషన్ కార్డు మంజూరు చేసిన తర్వాత రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మాత్రం తప్పనిసరిగా రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు.

మొత్తంగా రేషన్ కార్డులు లేని నిరుపేదలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పిన విషయం శుభవార్త అని చెప్పాలి.

**పించన్ పైనా అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం :** ఇక ఇదే క్రమంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గ్రామాలలో వృద్ధాప్యంలో ఉన్నవారు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ ఇవ్వడానికి అర్హులను గుర్తించాలని కూడా అధికారులకు సూచించారు.

విధులలో ఎవరు ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, పంచాయతీ కార్యదర్శులు స్థానికంగానే నివాసం ఉండాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. విధులలో అలసత్వం వహిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వేటు వేయాలని కూడా ఆయన అధికారులకు సూచించారు.

గరుడ వార్త
బుధవారం 6 నవంబర్ 2024

# సంపాదకీయం

## ప్రపంచ అంతానికి ఆరంభం వచ్చే ఏడాదేనా?

ప్రపంచం అంతం కానుందన్న అంచనాలు కొత్తేం కాదు. ఇదిగో ఏదో అవుతుంది? అదిగో మరేదో జరగనుందన్న వాదనలు.. అంచనాలు అప్పుడప్పుడు వినిపిస్తూ ఉంటాయి. అయితే.. గడిచిన కొన్ని నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న పరిణామాల్ని చూస్తే మాత్రం సమ్ థింగ్ రాంగ్ అన్న భావన కలుగక మానదు. ఏవైపు చూసినా ఏదో ఒక అనిశ్చితి.. అశాంతి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్న పరిస్థితి. ఇలాంటి వేళలో పాత విషయాలే కొత్తగా తెర మీదకు వస్తున్నాయి. బల్గేరియన్ కాలజ్ఞానిగా బాబా వంగా చెప్పిన అంచనాలు ఇప్పుడు మరోసారి ప్రస్తావిస్తున్నారు. గతంలో ఆమె చెప్పిన అంచనాలు ఎన్నో నిజమైన వేళ.. వచ్చే ఏడాది (2025)లో ప్రపంచ అంతానికి సంబంధించి ఒక ఘటన చోటు చేసుకుంటుందని చెప్పారు. 2025లో భారీ యుద్ధం ఒకటి జరగనుందని ఆమె హెచ్చరించారు. ఇది ప్రపంచ జనాభాకు భారీ చేటు చేస్తుందని.. 5079 నాటికి మానవ జాతి పూర్తిగా నాశనమవుతుందన్నది ఆమె అంచనా. ఇప్పటివరకు నిజమైన బాబా వంగా అంచనాల్ని చూస్తే.. రెండో ప్రపంచ యుద్ధంతో భారీ విధ్వంసం.. ఎక్కువ మరణాలు.. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం.. చెర్నోబిల్ విపత్తు.. స్టాలిన్ మరణం.. కుర్స్క్ జలాంతర్గామి విపత్తు.. అమెరికాపై సెప్టెంబరు 11న జరిగే దాడిని ఉక్కు పక్షుల దాడిగా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆమె అంచనాలు 85 శాతం నిజమయ్యాయి. 1911 అక్టోబరు 3న జన్మించిన బాబా వంగా తన 84వ ఏటన 1996 ఆగస్టు11న కన్నుమూశారు. ఈ నేపథ్యంలో 2025లో ఆమె చెప్పిన అంచనా విషయానికి వస్తే.. “2025 నాటికి భూమిపై గ్రహాంతర జీవులు కనిపిస్తాయి. ఈ జీవులు భూమిపై తమ ఉనికిని చాటుకుంటాయి” అని పేర్కొన్నారు. 16వ శతాబ్దపు ఫ్రెంచ్ జ్యోతిష్యుడు నోస్ట్రాడమస్ కూడా ఇలాంటి అంచనాల్నే అందించారు. 2025లో జరిగే యూరోపియన్ యుద్ధం గురించి ప్రస్తావించారు. ఆమె చెప్పిన ఇతర అంచనాల్ని చూస్తే.. వాతావరణ మార్పులతో ఏర్పడే కరువు.. అడవుల్లో కార్చిచ్చు లాంటి విపత్తులతో పాటు.. 2043 నాటికి యూరోప్ ముస్లిం పాలనలోకి వస్తుందని.. 2076 నాటికి కమ్యూనిజం ప్రపంచ వ్యాప్తంగా తిరిగి విస్తరిస్తుందని అంచనా వేశారు. వీటన్నింటికి ముందు మరో రెండు నెలల తర్వాత మొదలయ్యే 2025లో జరిగే దానిపైనే అందరి చూపు ఉందని చెప్పాలి.

# వ్యాపార కేంద్రానికి ప్రగతి కళ



గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రాలైన లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజారు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. భూగర్భ మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్తు దీపాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంత వ్యాపారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికలకు ముందు మేదరిబస్తీ–కళ్యాన్‌నగర్ ప్రధాన రహదారిలో దుర్గంధం భరించలేమంటూ సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లతో పాటు వ్యాపారులు రోడ్డుపై ధర్నా చేశారు. ఓ డివిజన్ కార్పొరేటర్ అయితే ఏకంగా నగరపాలక కార్యాలయం ఇంజినీరింగు విభాగంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవతో వ్యాపార కేంద్రంలో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ మొదలైంది. మొదటి విడతలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు రూ.100 కోట్ల రుణసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేయగా అందులో రూ.29.5 కోట్లు వ్యాపార కేంద్రంలోని సమస్యల పరిష్కారానికే కేటాయించారు. టెండరు ప్రక్రియ పూర్తయి పనులు సైతం మొదలుకావడంతో స్థానికులు సంతోషిస్తున్నారు.

**ముందుగా భూగర్భ మురుగు కాలువలు**

ప్రస్తుతం స్థానికులు దుస్తులతో పాటు వివిధ రకాల కొనుగోళ్లకు మంచిర్యాల, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ భారీ వ్యాపార సంస్థలు లేకపోవడమే దీనికి కారణమని భావించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రథమంగా అత్యాధునిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు. తద్వారా భారీ వ్యాపార సంస్థలు గోదావరిఖనిలో ఏర్పాటయ్యేలా ప్రోత్సహించడంపై దృష్టి సారించారు. దీనికంటే ముందుగా వ్యాపార కేంద్రంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటికే మేదరిబస్తీ అడ్డరోడ్డు నుంచి కళ్యాన్‌నగర్ కూడలి వరకు భూగర్భ మురుగు కాలువ నిర్మాణం పూర్తికాగా లక్ష్మీనగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజారులో నిర్మించాల్సి ఉంది. కళ్యాన్‌నగర్ కూడలి నుంచి అడ్డగుంటపల్లి వరకు సైతం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముందుగా రోడ్డుకు ఇరువైపులా తాగునీటి పైపులైన్లు వేసేందుకు తవ్వకాలు చేపట్టారు. రోడ్డు నిర్మించాక ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదనే ఆలోచనతో ఇలా చేస్తున్నారు. పైపులైన్ల నిర్మాణం పూర్తికాగానే భూగర్భ మురుగు కాలువలు, అనంతరం రహదారికి ఇరువైపులా విద్యుత్తు దీపాలను, కొన్ని చోట్ల కేంద్రీకృత విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులన్నీ పూర్తయ్యాక రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

నిధుల కేటాయింపు ఇలా... (రూ. కోట్లు)
భూగర్భ మురుగు కాలువలకు 10
సిమెంటు రహదారులకు 12 పాత విద్యుత్తు స్తంభాల తొలగింపు..కొత్త వాటి ఏర్పాటు 4 విద్యుత్తు దీపాలకు 3.5

# అంతులేని జాప్యం



రుద్రంగి : చందుర్తి–మోత్కురావుపేట మధ్య తారు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. దీంతో రహదారి పనులు మధ్యలో ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అనుమతులు తొందరగా ఇచ్చేలా చూడాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు లేఖ రాశారు. ఇప్పటికైనా ఆమోదం తెలిపితే రెండు జిల్లాల ప్రజలకు కష్టాలు తీరుతాయి. చందుర్తి మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని మోత్కురావుపేట మధ్య ఆరున్నరేళ్ల క్రితం రూ. 19.75 కోట్లతో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.

అటవీ ప్రాంతం మినహాయించగా మరో 5 కి.మీ.ల మేర తారు రోడ్డు పనులు నాలుగున్నరేళ్ల కిందట పూర్తయ్యాయి.

అటవీ ప్రాంతంలోని ఐదు చిన్న, చిన్న వాగులపై వంతెనలు నిర్మించాల్సి ఉంది.

వర్షాకాలంలో ఈ మార్గం నుంచి కాలినడకన కూడా వెళ్లలేని విధంగా బురద ఏర్పడుతుంది. వర్షాకాలం ప్రారంభంలో అక్కడక్కడ మట్టితో తాత్కాలికంగా దారిని ఏర్పాటు చేశారు. అనంతరం కురిసిన భారీ వర్షాలకు మట్టి దారి భారీగా కోతకు గురైంది.

జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి, భీమారం మండలాల ప్రజలు చందుర్తి, వేములవాడ, సిరిసిల్ల వంటి ప్రాంతాలకు రావాలంటే సుమారు 20 కి.మీ.ల దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి పట్టణాలకు ఈ మార్గంలో వెళ్తే 30 నుంచి 40 కి.మీ.ల దూరం తగ్గనున్నది.

శివరాత్రికైనా...

చందుర్తి–మోత్కురావుపేట రహదారిని పూర్తి చేయాలని, అటవీశాఖ అనుమతుల్లో జాప్యాన్ని నిరసిస్తూ 2022లో శివరాత్రి రోజున జాగరణ దీక్ష చేపట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షంలో ఉన్నపుడు పాదయాత్రలు చేశారు.

భాజపా ఆధ్వర్యంలో కూడా పాదయాత్ర నిర్వహించారు.

పలు గ్రామాలకు చెందిన యువజన సంఘాల నాయకులు రోడ్డు తొందరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కనీసం వచ్చే ఏడాది శివరాత్రి నాటికైనా పూర్తయితే రాజన్న భక్తులకు దూరాభారం తగ్గుతుంది.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

చందుర్తి– మోత్కురావుపేట రహదారి పనులు పూర్తి చేసేందుకు అటవీశాఖ అనుమతులు వచ్చేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. రానున్న వేసవి నాటికైనా రోడ్డు పూర్తయితే జగిత్యాల జిల్లాకు, సిరిసిల్ల జిల్లాకు మధ్య దూరాభారం తగ్గుతుంది. రాజన్న భక్తులకు కూడా వ్యయప్రయాసలు తొలగిపోతాయి.

మేడిశెట్టి శ్రీహరి, చందుర్తి

అనుమతులు వస్తేనే పనులు

అనుమతులు వస్తేనే అటవీ ప్రాంతం మధ్యలో నిలిచిపోయిన పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటికైతే అనుమతులు రాలేదు. మా శాఖ పరంగా చేయాల్సిన కృషి చేస్తున్నాం. శాంతయ్య, డీఈ, ఆర్అండ్‌బీ

# శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి





శామీర్ పేట, (గరుడ వార్త) : అలియాబాద్ గ్రామం పరిధిలో అనుమా నాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం సమయంలో శామీర్ పేట మండలం అలియాబాద్ పరిధిలోని హెచ్ బి ఎల్ కంపెనీ సమీపంలోని సర్వే నెంబరు 580లోని ఓ వ్యవసాయ పొలంలో ఫారుక్(41) పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఫారుక్ రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందిన శామీర్ పేట పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా మంచంపై నోట్లో నుంచి నురగ వచ్చి వాంతి చేసుకొని ఫారుక్ చనిపోయి ఉన్నాడు. సంఘటన స్థలంలో చుట్టుపక్కల వారిని విచారణ చేయగా ఫారుక్ గత ఆరు సంవత్సరాల నుంచి అదే వ్యవసాయ భూములులో సూపర్వైజర్ గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈరోజు ఉదయం సమయంలో లేచి టిఫిన్ చేసి గార్డెన్ లో పనిచేస్తుండగా మధ్యాహ్నం 12: 30 గంటలకు కళ్ళు తిరుగుతున్నా యని చెప్పి గదిలోకి వెళ్లి పడుకున్నాడు. మధ్యాహ్నం 3. 30 గంటలకు పార్క్ లో పారుతో పాటు పనిచేసే జనార్దన్, ఫారుక్ గదికి వెళ్ళగా మంచం పై ఫారుక్ వాంతి చేసుకుని చనిపోయి పడి ఉన్నాడు. ఫారుక్ ఆరోగ్య సమస్యల వలన మృతి చెందాడ, పాము కాటు వలన మృతి చెందాడ, ఇతర కారణాల వలన మృతి చెందాడాని తెలియ రాలేదు. శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారిణి స్కంధవి ఎంపిక

శామీర్ పేట, (గరుడ వార్త) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జైన్ హెరిటేజ్ పాఠశాల విద్యార్థిని స్కందవి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మంగళవారం తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న కీసర లోని సెరినిటీ పాఠశాలలో జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాస్థాయి అండర్ 14 బాలికల విభాగం కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరిచిన శామీర్ పేట మండలం మజీద్ పూర్




లోని జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ పాఠశాల విద్యార్థిని, కేశవరం గ్రామానికి చెందిన మేడోజి స్కంధవి రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 7, 8 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా లో జరగనున్న రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎదగాలని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీలు సూచించారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన స్కంధవిని వారు అభినందించారు.

# జ్వర బాధితులతో ఆసుపత్రుల కిటకిట

మంథని : నియోజకవర్గ పరిధిలో జ్వరాల విజృంభణతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సేవలు అందుబాటులో లేక బాధితులు మంథని పట్టణానికి వస్తున్నారు. జ్వరమొస్తే వారం వరకు వదలడం లేదు. ఒళ్లు నొప్పులు, చేతులకు దద్దుర్లు రోగులను వేధిస్తున్నాయి. ఆసుపత్రులకు వచ్చే రోగుల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా బాధితులు అధికంగా ఉంటున్నారు. జ్వరం బారిన పడి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే వివిధ పరీక్షలకు, మందులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతున్నాయని బాధితులు వాపోతున్నారు.

**వాతావరణంలో మార్పులతోనే..**

మంథని సామాజిక వైద్యశాలలో సోమవారం ఓపీ 331గా నమోదైంది. 45 మందికి జ్వరం నిర్ధారించారు. 128 మంది ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నారు. 11 మంది ఆసుపత్రిలో చేరి(ఇన్‌పేషెంట్లుగా) చికిత్స తీసుకుంటున్నారు. సెప్టెంబరు 1 నుంచి 20 వరకు మొత్తం 6,483 మంది ఆసుపత్రికి రాగా 4,285 మంది పరీక్షలు చేయించుకున్నారు. 1,252 మందికి జ్వరాలు నిర్ధారించారు. వీరిలో తొమ్మిది మంది టైఫాయిడ్, 34 మంది డయేరియా బాధితులున్నారు. 322 మంది ఆసుపత్రిలో చేరారు. వాతావరణంలో మార్పులతో జ్వరాలు విస్తరిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత లోపించడం, దోమల బెడదతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇరవై రోజులుగా జ్వర బాధితులు అధికంగా వస్తున్నారని మంథని ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ 250కి పైగా ఓపీ నమోదవుతుండగా, అత్యవసరమైన వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స అందిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వారం, పది రోజుల్లో నొప్పులు తగ్గుతాయని ఆయన చెప్పారు.

# యాప్‌లో వివరాలు.. విడుదలయ్యేనా నిధులు?

సిరిసిల్ల : ఆధార్ తప్పులు, బ్యాంక్ ఖాతాలో పేరు సరిపోని వాటికి ఆయా బ్యాంకు నోడల్ అధికారులకు ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. దీంతో రైతుల నుంచి అఫిడవిట్‌లు తీసుకుని నమోదు చేస్తున్నారు. ఇంకా అక్కడక్కడ రైతులు తమ ఆధార్ కార్డులను బ్యాంకు ఖాతాలకు అనుసంధానించని వారు ఉన్నారు. మరికొందరు రైతులు విదేశాల్లో ఉండటం, కొందరి ఖాతాలు మనుగడలో లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను ఇప్పటి వరకు మూడు విడతల్లో పూర్తి చేసింది. అర్హులైన రైతులకు పలు కారణాలతో రుణమాఫీ అందలేదు. వీరిలో కుటుంబ నిర్ధారణ బాధ్యతలను ప్రభుత్వం వ్యవసాయశాఖకు అప్పగించింది. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించి ఇచ్చారు. అధికారులు క్లస్టర్ల వారీగా అర్హులైన రైతుల వివరాలను ఈ యాప్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ ఈ నెల 22తో పూర్తయింది. ఇంకా ఆధార్ కార్డులో చిరునామా, ఇంటి పేరు బ్యాంకు ఖాతాలో మరో విధంగా ఉండటం, పట్టాదారు పాస్ పుస్తకం లేని వివరాలను బ్యాంకర్లకు అప్పగించారు. వీటన్నింటికోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఇదే కాకుండా రైతులు రూ.2 లక్షల పైన ఉన్న మొత్తాన్ని బ్యాంకులో చెల్లిస్తే వాటిని కూడా మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇవన్నీ మాఫీ కావాలంటే ప్రభుత్వం నాలుగో విడత నిధులు విడుదల కావాలి. వీటికోసం అర్హులైన రైతులు ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.13 లక్షల మంది రైతులకు మూడు విడతల్లో రూ.1,588 కోట్లు మాఫీ అయ్యాయి. వీటిని ప్రభుత్వం నేరుగా బ్యాంకు




ఖాతాల్లో జమ చేసింది. అర్హులైన 28,599 మందికి వివిధ కారణాలతో మాఫీ కాలేదు. వీరిలో 16,352 మంది కుటుంబాలను నిర్ధారణ చేసి వ్యవసాయశాఖ అధికారులు యాప్‌లో నమోదు చేశారు.

**రేషన్‌కార్డులో పేరు లేక...–** చౌదరి, నిమ్మపల్లి

నాకు మొదటి విడతలోనే రూ.95 వేలు మాఫీ కావాల్సి ఉంది. అధికారులను సంప్రదిస్తే రేషన్ కార్డులో పేరు లేదని చెప్పారు. తర్వాత వ్యవసాయాధికారులు కుటుంబ సభ్యుల నిర్ధారణ వివరాల్లో నమోదు చేసుకున్నారు. నాలుగో విడత వస్తాయంటున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ఎనిమిదేళ్ల క్రితం నా భార్య పేరున ఉన్న రేషన్ కార్డులో నా పేరు తొలగించారు. ప్రస్తుతం రేషన్ సరకులు కూడా రావడం లేదు.

**ఉత్తర్వులు రాలేదంటున్నారు–** రవీందర్‌రెడ్డి, నిజామాబాద్

నాకు, నా భార్య చంద్రకళ పేరున రూ.3.20 లక్షల వ్యవసాయ రుణం ఉంది. ప్రభుత్వం రూ.2 లక్షలపైన ఉన్న మొత్తం చెల్లిస్తే మాఫీ చేస్తామన్నారు. దీంతో పైన ఉన్న మొత్తం చెల్లించేందుకు బ్యాంకు అధికారులను సంప్రదిస్తే మాకు దానిపై స్పష్టమైన ఉత్తర్వులు రాలేదని చెబుతున్నారు.

**విడుదల కాగానే ఖాతాల్లో జమ–** మల్లికార్జున్, ఎల్‌డీఎం

గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలను వ్యవసాయశాఖ, బ్యాంకర్ల వద్ద నమోదు ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే నేరుగా వారి ఖాతాల్లో జమవుతాయి.

# బాండ్ పేపర్ పూచీకత్తులకు అంగీకారం

నిజామాబాద్ : ధాన్యం కేటాయింపునకు మిల్లర్లు కోరినట్లుగా బాండ్ పేపరు పూచీకత్తులకు అధికారులు అంగీకారం తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించినట్లుగా బ్యాంకు గ్యారంటీలు సమర్పించేందుకు తమకు వారం, పది రోజులు గడువు ఇవ్వాలని మిల్లర్లు కోరిన విషయం తెలిసిందే. అప్పటి వరకు ధాన్యం కేటాయింపులు జరగకుంటే.. కొనుగోలు ప్రక్రియపై ప్రభావం పడనున్న నేపథ్యంలో మధ్యస్తంగా ఈ పది రోజులకు బాండ్ పేపర్ పూచీకత్తు ఇస్తామని వారు కోరారు. అధికారులు సైతం సరే అనటంతో మిల్లర్లతో ఒప్పందాలు ప్రారంభమయ్యాయి. 72 మిల్లుల వారు పౌరసరఫరాలశాఖకు దరఖాస్తు చేయగా.. వీరిలో 50 మిల్లులే సీఎంఆర్ బకాయిల నిబంధనలకు లోబడి ఉన్నట్లు తేల్చారు. ప్రస్తుతానికి ఈ మిల్లులకు మాత్రమే కాంటాలు వేసిన వడ్ల బస్తాలను తరలించాలని అధికారులు ఆదేశించారు.

**14,500 బస్తాల సేకరణ**

మిల్లర్లతో సంబంధం లేకుండానే కొన్ని సహకార సంఘాల్లో కాంటాలు వేశారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు 14,500 బస్తాలు తూకం వేసి కొనుగోలు చేశారు. వీటిని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వెంటనే ఎంపిక చేసిన మిల్లులకు తరలించాలని సూచించారు. నిజానికి ధాన్యాన్ని మిల్లులకు రవాణా సందర్భంలో ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రానికి దగ్గరగా ఉండేలా కేటాయింపులు ఉంటాయి. కానీ ఇంకా ఒప్పందాలు పూర్తిస్థాయిలో జరగలేదు. 250 మిల్లులకు 50 మాత్రమే ముందుకొచ్చాయి. ఈ క్రమంలో కొనుగోలు జరిగిన చోట నుంచి దూరంలోని మిల్లులకు ప్రస్తుతానికి తరలిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

**అడ్డంకులు తొలగాయి..**

మిల్లర్లతో ఒప్పందాలు మొదలవ్వటంతో ధాన్యం కొనుగోళ్లలో ప్రధాన అడ్డంకి తొలగింది. అయితే దీపావళి పండగ, అమావాస్య కారణంగా మిల్లుల్లో పూజలు, రైతులు కూడా కోతలకు దూరంగా ఉండడంతో రెండు రోజులు కొనుగోళ్లపై దృష్టి పెట్టలేకున్నామని అధికారులు చెప్పారు. ఆదివారం నాటికి కొనుగోళ్లు ఊపందుకుంటాయని ఓ అధికారి చెప్పుకొచ్చారు. కేంద్రాలు ఎక్కువ మొత్తంలో ఉండటంతో రోజులో 15 వేల మెట్రిక్ టన్నులకు పైగానే సేకరణ జరిగే అవకాశం ఉందంటున్నారు. మిల్లర్ల సంఖ్య కూడా రెండు రోజుల్లో 200 వరకు రావొచ్చని చెబుతున్నారు.

**సన్నాలకు ప్రత్యేకంగానే..**

సన్నాలను ప్రత్యేకంగానే కాంటా వేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదివరకు కూడా మద్దతు ధరలో రూ.20 వ్యత్యాసం ఉండటంతో వేర్వేరుగానే వేసేవారు. కానీ ప్రస్తుతం రూ.500 బోనస్ నిర్ణయం ఉండటంతో రైతు వారీగా సన్నాల కొనుగోళ్ల వివరాలను సొసైటీ రికార్డుల్లో, ట్యాబ్‌ల్లోని ఓపీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయించనున్నారు. బోనస్ విషయంలో ఇంకా విధివిధానాలు ఖరారు కానప్పటికీ.. రానున్న రోజుల్లో నిర్ణయం జరిగితే.. అర్హుల ప్రాతిపదికకు లెక్కలు సులువుగా ఉండేలా సన్నద్ధం అవుతున్నట్లు వివరిస్తున్నారు.

# రాత్రి గస్తీ..పీసీబీలో నాస్తి



హైదరాబాద్: పౌరుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నైట్ ప్యాట్రోలింగ్ సిబ్బంది తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. ఘాటు వాసనలు ఇబ్బంది పెడుతున్నాయంటూ ఫోన్ వస్తే వెంటనే అక్కడికి వెళ్తున్న బృందం.. ఆ వాసనలు ఎక్కడినుంచి వస్తున్నాయో కనిపెట్టడం లేదు.

**ఇదీ చేయాల్సింది..**

పీసీబీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయాల పరిధిలో మూడు నైట్ ప్యాట్రోలింగ్ వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్కో వాహనంలో ఒక అనలిస్ట్, ఏఈ, ఈఈ స్థాయి అధికారులు, సెక్యూరిటీ గార్డులు ఉంటారు. ఘాటు వాసనలు వచ్చినా, డంపింగ్ చేస్తున్నట్టు సమాచారం అందిన వెంటనే వీరంతా అక్కడికి చేరుకుంటారు. రోజువారీ నిఘాపై వివరణ, నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అధికారులు ఇచ్చే నివేదికపై 'పీసీబీ సభ్య కార్యదర్శి' స్థాయిలో సమీక్ష జరుగుతుంది.

**వరుస ఫిర్యాదులు**

ఖైరతాబాద్‌లో ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయంటూ వెంకటరమణ కాలనీ, చింతల్‌బస్తీ ప్రాంతవాసులు పీసీబీకి వరుస ఫిర్యాదులు చేస్తున్నారు. పీసీబీ విభాగం ఇప్పటి వరకు ఆ సమస్యను పరిష్కరించలేదు. నైట్ ప్యాట్రోలింగ్ బృందం సమస్యను గుర్తించలేదు. పటాన్‌చెరు, పాశమైలారం, సూరారం, బాచుపల్లి, చెంగిచెర్ల, నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో రాత్రివేళ ఘాటు వాసనలు నిత్యకృత్యమయ్యాయి.

ఆటోనగర్ పారిశ్రామికవాడలో బ్యాటరీ దుకాణాలు, సర్వీసింగ్ కేంద్రాలున్నాయి. రసాయన వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఎస్టీపీ సామర్థ్యానికి మించి వ్యర్థాలు ఉత్పత్తి అవడంతో ఘాటు వాసనలు వెల్లువెత్తుతున్నాయి.

# వయ్యారి భామలు.. వలపు బేడీలు!



హైదరాబాద్ : ఆ చూపులకు చిక్కారో.. అడ్డంగా బుక్కయినట్టే. మాటలకు పొంగిపోయారో జేబులు గుల్ల చేసుకున్నట్టే. సరైన జోడు కోసం వెతికే పెళ్లికాని ప్రసాద్‌ల నుంచి.. నచ్చిన మగువతో సరదాగా గడపాలనుకునే పురుషోత్తముల బలహీనతను ఆసరా చేసుకొని వయ్యారీ కిలేడీలు వలపు వల విసరుతున్నారు. సామాజిక మాధ్యమాలు.. పబ్‌లు.. రేవ్‌పార్టీలు.. డేటింగ్‌యాప్‌లు..ఆన్‌లైన్ వివాహ పరిచయ వేదికలను అనువుగా మలచుకొని తేలికగా బురిడీ కొట్టిస్తున్నారు. బుక్కయ్యామని గుర్తించేలోపే దొరికినంత సొమ్ము గుంజి ఝలక్ ఇస్తున్నారు. బయటకు చెబితే పరుతు పోతుందని.. ఇంట్లో తెలిస్తే కాపురం కొల్లేరవుతుందనే భయంతో బాధితులు మౌనం వహిస్తున్నారు. నగరంలో ఎక్కువ మంది డేటింగ్‌యాప్‌లు, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారానే మోసపోతున్నట్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినపుడే ఇటువంటి ఆగడాలకు కళ్లెం వేయగలమని సూచిస్తున్నారు.

**నమ్మారో.. బుక్కయినట్టే**

ఇటీవల మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో నకిలీ ప్రొఫైల్స్ ఉంచి.. అబ్బాయిలను పెళ్లి పేరిట మోసగిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహ పరిచయ వేదికల్లో పరిచయమైన యువకుల నుంచి ఫోన్ నంబర్లు తీసుకొనేవారు. ఇద్దరు యువతులకు కమీషన్ ఇస్తామని ఆశచూపి వారిని వధువులుగా పరిచయం చేయించేవారు. తమ పుట్టిన రోజంటూ బహుమతులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారంటూ నగదు కాజేసేవారు. పెళ్లిప్రస్తావన వచ్చాక ముఖం చాటేసేవారు. అట్నుంచి గట్టిగా నిలదీస్తే లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేస్తామని బెదిరించేవారు. ఇలా సుమారు 50 మంది మోసపోయినట్టు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. అర్ధరాత్రి దాటాక.. వాట్సాప్ వీడియోకాల్ చేసి సెక్స్‌టార్షన్‌తో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. బాధితుల జాబితాలో మల్టీప్లెక్స్ యజమాని, విశ్రాంత ఐఏఎస్ అధికారి, సినీ నిర్మాత ఉన్నారు. ట్రయాంగిల్ లవ్‌స్టోరీలో ఒక యువతి మాజీ ప్రేమికుడి కారులో డ్రగ్స్ ఉంచి పోలీసులకు పట్టిచ్చింది. అతడ్ని వదిలించుకునేందుకు మాయలేడీ ఆ పనిచేసినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

**వీరంతా ఎవరో తెలుసా...!**ఉద్యోగావకాశాల కోసం ఎంతోమంది యువతులు నగరానికి చేరుతుంటారు. కుటుంబం నడిపేందుకు.. పిల్లల ఫీజులకు, ఖర్చుల కోసం 'కిరాయి మనుషులు'గా మారుతున్నారు. ఇటీవల బంజారాహిల్స్ ఠాణా పరిధిలోని పబ్‌లో పట్టుబడిన 42మంది మహిళల్లో నలుగురు గృహిణిలున్నారు. వారిలో ఒక మహిళకు 4 నెలల కుమార్తె ఉంది. భర్త ఆదరణకు దూరమైన ఆమె ఆర్థిక ఇబ్బందులు అధిగమించేందుకు పబ్ నిర్వాహకులు ఇచ్చే రూ.2వేల కోసం మగవారితో మాటలు కలిపి బిల్లులు పెరిగేలా చేసేందుకు అంగీకరించినట్టు వాపోయారు. ఉత్తరాది నుంచి వచ్చిన యువతి స్పా సెంటర్‌లో పనిచేస్తుంది. వచ్చే ఆదాయం, అద్దెలు, ఖర్చులకు సరిపోతున్నాయి. తల్లిదండ్రులకు డబ్బు పంపేందుకు ఇలా చేస్తున్నానంటూ పోలీసులకు వివరించింది.

# వీడీసీల అండగా.. దందాల జోరు



మెట్‌పల్లి : పల్లెల్లో అక్రమ దందాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాభివృద్ధి కమిటీల(వీడీసీ)ను ఏర్పాటు చేసుకొని ఇసుక, మద్యం, మట్టి, రాళ్లు వంటి అక్రమ కార్యకలాపాలకు వేలం పేరుతో అనధికార అనుమతులు జారీ చేస్తూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధితశాఖల అధికారులు తమకేమీ పట్టనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ దందాలతో గ్రామాల్లో గొడవలు చోటుచేసుకుంటున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ల పరిధిలోని గ్రామాల్లో అనధికార కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమ దందాలకు దన్నుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా వాగులు, కాలువల వెంట ఉన్న గ్రామాలు, గోదావరి శివారు గ్రామాల్లో వేలం నిర్వహిస్తూ ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నాయి. ఇటీవల వరద కాలువలో ఇసుక నిల్వలు పేరుకుపోవడంతో వేలం నిర్వహిస్తున్నారు. ఒకవైపు జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణాపై ఆగ్రహంతో ఉన్నప్పటికీ గ్రామాల్లో మాత్రం వేలం పాటలు ఆగడం లేదు. గతంలో కొన్ని రోజులు పోలీసులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకున్నప్పటికీ ఇటీవల రాజకీయ ఒత్తిడితో మిన్నకుండిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వాగులు, వంకల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. వరద కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో కాలువ ఒడ్డున పోసిన మట్టి నుంచి రాళ్ల తరలింపునకు వేలం వేయడం గమనార్హం. ఇవే కాకుండా మద్యం గొలుసు దుకాణాల నిర్వహణకు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. ఏడాదికి, నెలకు అంటూ పెద్ద మొత్తం నిర్ణయించి కొనసాగిస్తున్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడానికి వెనుకాడడం లేదు. ఇటీవల మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలో మద్యం గొలుసు దుకాణాలను మూసివేయాలని గోడ ప్రతులు వెలిసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే ఓ గ్రామంలో డీజే విషయంలో గ్రామాభివృద్ధి కమిటీ, మరి కొంత మందికి వివాదం ఏర్పడగా, ఇద్దరికి జరిమానా విధించిన విషయం పోలీసుల వరకు వెళ్లింది. దీన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కోరుట్ల మండలంలోని ఓ పెద్ద గ్రామంలో రెండు నెలల కిందట నాలుగు గొలుసు మద్యం దుకాణాల నిర్వహణకు ఒక్కో దుకాణదారుడు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.8 లక్షలు వీడీసీకి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. పోలీసులు వీడీసీ సభ్యులు, మద్యం విక్రయదారులను పిలిపించి మందలించి పంపించారు. మరోమారు ఇలా చేస్తే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.కోరుట్ల మండలంలోని ఓ గ్రామంలో సుమారు 30 ఇసుక ట్రాక్టర్లు ఉంటాయి. వారు పక్కమండలంలోని రెండు గ్రామాల పరిధిలోని వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు కొన్నేళ్లుగా చేపడుతున్నారు. వాగు ఒడ్డునున్న స్థలాలు కుల సంఘాలకు చెందినవని వారికి లక్షల్లో నగదు ముట్టజెప్పి ఇసుకను తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు.

మల్లాపూర్ మండలంలోని ఓ గ్రామంలోని పెద్దవాగులో అక్రమ ఇసుక తవ్వకాలు, మద్యం విక్రయాలకు రూ.6.50 లక్షలకు వీడీసీ సభ్యులు వేలం నిర్వహించినట్లు తెలిసింది. సదరు వాగులోని ఇసుకను తీసుకునేందుకు ఇటీవల జిల్లా అధికారులు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అదేచోట అక్రమంగా ఇసుకను తవ్వేందుకు వేలం నిర్వహించడం గమనార్హం.

కోరుట్లను ఆనుకొని ఉన్న ఓ గ్రామంలో వాగులో ఇసుక తవ్వకాలకు గతేడాది ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1.50 లక్షలు చెల్లించగా, ప్రస్తుత ఏడాది సైతం అంతే మొత్తంలో చెల్లించాలని నిబంధనలు విధించారు.

మెట్‌పల్లి మండలంలోని పెద్దవాగు వెంట ఉన్న ఓ గ్రామంలో రూ.8.60 లక్షలకు ఇసుక వేలం నిర్వహించినట్లు తెలిసింది.

మెట్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో పెద్దవాగు, వరద కాలువలో ఇసుక రవాణాకు రూ.26 లక్షలకు వేలం వేసినట్లు సమాచారం.

కథలాపూర్ మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల మద్యం విక్రయాలకు వేలం వేశారు. మరో గ్రామంలో వాగులో ఇసుకను తవ్వుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.వేలల్లో చెల్లించాలని, మరో గ్రామంలో మద్యం విక్రయ దుకాణానికి రూ.50వేలు చెల్లించాలనే నిబంధనలు విధించినట్లు సమాచారం.

# ప్రధాన సమస్యల పరిష్కార బాట

గోదావరిఖని : తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(టి.యు.ఎఫ్.ఐ.డి.సి.) విడుదల చేసిన రూ. 20 కోట్లతో రామగుండం నగరపాలక ప్రాంతంలోని ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేక శ్రద్ధ వహించి టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధుల విడుదల కోసం తీవ్రంగా కృషి చేశారు. దీంతో గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోనున్నాయి. గతంలో కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయిన రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంతో తమ ఇబ్బందులు తీరతాయని స్థానికులు భావిస్తున్నారు.

**సమస్యల పరిశీలన...**

నగరంలో పెండింగ్‌లో ఉన్న, అర్ధాంతరంగా ఆగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. గోదావరిఖనిలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో శివాలయం వైపునుంచి, ప్రభుత్వ ఆసుపత్రి వైపు నుంచి రోడ్డు నిర్మాణం పూర్తికాగా నిధులు సరిపోలేదంటూ మధ్యలో కొంత మేరకు రోడ్డు నిర్మాణం వదిలేసి సంవత్సరాలు గడచినా పాలకవర్గం, అధికారులు పట్టించుకోలేదు. దీనిపై పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా నగరపాలక ఈఈ రామన్ దృష్టికి సమస్య వెళ్లడంతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. ఇదే తరహాలో



గోదావరిఖని మార్కండేయకాలనీ ప్రధాన రహదారి నుంచి ఓ ప్రైవేటు పాఠశాల మీదుగా చంద్రబాబునాయుడు కాలనీ వైపునకు వెళ్లే ప్రధాన రహదారిలో భూగర్భ మురుగు కాలువ నిర్మించారు. రోడ్డు నిర్మాణం కోసం దొడ్డు కంకర వేశాక నిధులు సరిపోలేదని వదిలేశారు. తాజాగా టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులతో ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఇదే తరహాలో మార్కండేయకాలనీలో మురుగు కాలువ నిర్మాణం నిలిచిపోగా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. చినుకు పడిందంటే అడుగుపెట్టేందుకు వీలులేకుండా బురదమయమయ్యే దుర్గానగర్ ప్రాంతంలోని ప్రధాన, అంతర్గత రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేశారు.

**త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు- రామన్, రామగుండం నగరపాలక ఈఈ** గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిలిచిపోయిన అభివృద్ధి పనులతో పాటు అత్యవసరమైన అభివృద్ధి పనులపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం. నగరంలోని అన్ని డివిజన్లలో ఇలాంటి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యే, మేయర్, పాలకవర్గం, ఉన్నతాధికారుల సూచనలు, సమన్వయంతో రామగుండంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నాం.

# వీటీఏడీఏ.. జిల్లా అంతటా విస్తరణ!

సిరిసిల్ల : వేములవాడ ఆలయ అభివృద్ధికి ఏర్పాటు చేసిన వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) పరిధి జిల్లా అంతటికీ విస్తరించింది. 2016 ఫిబ్రవరిలో ఏర్పాటైన వీటీఏడీఏ కార్యాలయం 2023 ఆగస్టు వరకు హైదరాబాద్‌లోనే ఉంది. ఏడేళ్లలో రూ.450 కోట్లతో ప్రణాళికలు రూపొందించినా ఆశించిన స్థాయిలో ఆలయ అభివృద్ధి జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.77 కోట్లు ఖర్చయ్యాయి. వీటిలో రూ.9.26 కోట్లు అందులో పని చేసే పొరుగుసేవల ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయం అద్దెకు చెల్లించారు. మిగతావి గుడిచెరువు విస్తరణకు అవసరమైన భూసేకరణకు పరిహారం చెల్లించారు. ప్రస్తుతం దీని పరిధిని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికలతోపాటు 152 రెవెన్యూ గ్రామాలతో జిల్లా అంతటా విస్తరించారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను అధికంగా రాబట్టుకోవడంతోపాటు ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ పథకాల్లో భారీగా ప్రజలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంటుంది.

**ప్రయోజనాలు ఇలా**

వీటీఏడీఏ ప్రత్యేక స్వయం ప్రతిపత్తి సంస్థగా మారింది. దీనికి నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు మంజూరవుతాయి.

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ తీర్మానంతో ఆయా గ్రామాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, కేంద్రీయ విద్యుత్ దీపాలు, పార్కులు, అంతర్గత రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలకు నేరుగా నిధులు వెచ్చించవచ్చు.

లేఅవుట్ల అభివృద్ధితోపాటు పంచాయతీల్లో భవన నిర్మాణాలకు ప్రస్తుతం జీ౦2 వరకు మాత్రమే అనుమతి ఉంది. పరిధి విస్తరణతో జీ౦5 వరకు వీటీఏడీఏ అనుమతులు ఇవ్వనున్నది. పురపాలికలు, గ్రామాల పాలకవర్గాలకు అనుసంధానంగా పని చేస్తుంది.

చేపడుతున్న పనులు

దేశంలోనే అతిపెద్ద శైవక్షేత్రం వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు ఏటా కోటికిపైగా భక్తులు వస్తుంటారు. వీటీఏడీఏ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటికీ రూ.90 కోట్ల మేరకు పనులు పూర్తయ్యాయి.

ప్రస్తుతం రూ.12 కోట్లతో గుడిచెరువు పార్కు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రూ.2 కోట్లతో నిర్మించిన పార్కు పనులు పూర్తయ్యాయి. పార్కింగ్ ప్రాంతంలో శివార్చన వేదిక పనులు చివరి దశలో ఉన్నాయి.

రూ. 10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. రహదారులు, భవనాలశాఖ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు జరగాల్సి ఉంది. దీనిలో ప్రధానంగా కోరుట్ల ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అంతర్గత రహదారుల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉంది.

జగిత్యాల బాహ్యవలయ రహదారి పక్కన బస్‌స్టేషన్ నిర్మాణానికి గతంలో 20 ఎకరాల సేకరణకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భూసేకరణకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేయాల్సి ఉంది.

తిప్పాపూర్ బస్టాండ్ కూడలి నుంచి ఆలయం ముందు వరకు రహదారి విస్తరణకు గతంలో రూ.35 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. కాగా అసంపూర్తి వంతెన నిర్మాణం, పరిహారం కోసం దీనిని రూ.50 కోట్లకు పెంచేందుకు నిర్ణయించారు. ఇక్కడ భూసేకరణ కొలిక్కిరావాల్సి ఉంది.

**సిబ్బంది నియామకం?**

పరిపాలన సౌలభ్యం కోసం వీటీఏడీఏను 2023 ఆగస్టులో వేములవాడకు మార్చారు. ప్రస్తుతం రాజరాజేశ్వరి అమ్మవారి అతిథి గృహం మొదటి అంతస్తులో కార్యాలయం ఏర్పాటు చేశారు. దీనిలో కార్యదర్శి, ముఖ్య ప్రణాళిక అధికారి, ఎస్టేట్ అధికారితోపాటు వివిధ విభాగాల్లో 14 మంది కార్యాలయ సిబ్బంది ఉండాలి. కార్యాలయం వేములవాడకు మార్చిన తరవాత కార్యదర్శి మినహా ఎవరూ లేరు. పరిధి విస్తరణతో హెచ్‌ఎండీఏ (హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ) తరహాలో ఇక్కడ కూడా శాఖల వారీగా ఉద్యోగులను నియమించనున్నారు.

# బొగ్గుగనుల ఖిల్లా.. తప్పుతోంది కళ

కొత్తగూడెం: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రయాణికులు వంట చేసుకునేందుకు పెట్టిన పొయ్యిరాళ్లు మండటంతో మొదలైన సింగరేణి ప్రస్థానం.. ఎన్నో మైలురాళ్లను సాధించి ఎంతోమంది కార్మికులకు ఉపాధి బాట చూపింది. బొగ్గుట్టగా ప్రసిద్ధిచెందిన ఇల్లెందు, వేల సంఖ్యలో కార్మికులతో కళకళలాడిన కొత్తగూడెం, మణుగూరు పట్టణాలు ఆర్థిక ప్రగతి సాధించాయి. ఇదంతా గతం.. కొన్నేళ్లుగా భూగర్భగనులు మూతపడటం,ఉపరితల గనుల్లో తక్కువమంది పనిచేయాల్సి రావడంతో కార్మికులసంఖ్య తగ్గిపోయి ఆప్రభావం ఆయా పట్టణాల అభివృద్ధిపై పడుతోంది.

5 వేలకు పడిపోయిన కార్మికుల సంఖ్య

గతంలో సుమారు 15వేల పైచిలుకు గని కార్మికులు పనిచేసిన కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో కాలక్రమేణా ఆసంఖ్య తగ్గుముఖం పడుతోంది. జిల్లాలోని అన్ని ఏరియాల్లో కార్మికుల సంఖ్య సుమారు 5వేలకు పడిపోయింది. గనులు మూతపడటంతో ఇంతకాలం ఇక్కడ పనిచేసిన కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. తద్వారా జిల్లాలో కొనుగోలు శక్తి తగ్గి వ్యాపారం, వాణిజ్య రంగాలపై ఆర్థికంగా ప్రభావం పడుతోంది.

నూతన గనుల ఊసేది..?

సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై పెడుతున్న శ్రద్ధ.. సంస్థ మనుగడపై చూపటం లేదని వివిధ కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. భూగర్భగనులను క్రమంగా మూసేస్తున్న యాజమాన్యం వాటి స్థానంలో ఉపరితల గనులను తెరపైకి తెస్తోంది. జిల్లాలోని మూడు ఏరియాల్లో కొన్ని భూగర్భగనులు ఇప్పటికే మూతపడగా.. కొన్నిచోట్ల ఓసీల పరిస్థితి అలాగే ఉంది. మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో నూతన గనుల కేటాయింపులో తీవ్ర జాప్యం నెలకొంటోంది.

ప్రైవేటు సంస్థలతో పోటీపడితేనే..

ప్రైవేటు సంస్థలు తక్కువ వేతనాలతో కార్మికులను వినియోగించుకుని అత్యాధునిక యంత్రాలతో వేగంగా బొగ్గు తవ్వకాలు జరుపుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ సంస్థలతో పోల్చితే వాటికి ఉత్పత్తి వ్యయం తగ్గుతోంది. బొగ్గు తవ్వకాల్లో పోటీతత్వం పెంచటానికి గనుల వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్రం చెబుతోంది. భూగర్భగనుల్లో బొగ్గు తవ్వకాలపై విపరీతంగా నష్టాలు వస్తున్నా, ఉపరితల గనుల్లో వచ్చే లాభాలతో



వాటిని సింగరేణి కొనసాగిస్తోంది. ప్రైవేటు సంస్థలు నష్టాలు వచ్చే గనుల్లో తవ్వకాలు నిలిపేస్తాయి. వేలాది కార్మికుల జీవనోపాధితో ముడిపడిన సింగరేణి గనులు ముమ్మందు నిలదొక్కుకోవాలంటే ప్రైవేటు సంస్థలతో పోటీపడుతూ బొగ్గును వెలికితీయాలి.

సింగరేణి గుర్తిస్తే.. కేంద్రం వేలం వేస్తోంది

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా నూతన బొగ్గు గనులను సింగరేణి సంస్థ అన్వేషించింది. వీటిలో ప్రధానంగా పెనగడప, చర్ల, అనిశెట్టిపల్లి, గుండాల, రాంపురం, పునుకుడుశెలక ప్రాంతాల్లో నల్లబంగారం లభ్యతపై సర్వేలు నిర్వహించి ఓ అంచనాకు వచ్చింది. ఇటీవల తీసుకొచ్చిన నూతన చట్టం ద్వారా సింగరేణి గుర్తించిన బొగ్గు గనులను కేంద్రం వేలం వేయటానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే కోయగూడెం బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేటు కంపెనీలు దక్కించుకున్నాయి. సింగరేణి సంస్థ వేలం ద్వారా కొత్త గనులను పొందలేకపోయినా ప్రస్తుత గనులను విస్తరిస్తేనే జిల్లాలో ఆ సంస్థకు భవిష్యత్తు ఉండనుంది.

మరికొన్ని దశాబ్దాల పాటు ఈప్రాంతంలో బొగ్గు తవ్వకాలకు కావాల్సిన నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. కొత్తగా భూగర్భగనుల ఏర్పాటు ద్వారా నియామకాలు చేపట్టి తవ్వకాలు జరపాలి. సంస్థ మనుగడను దృష్టిలో ఉంచుకుని సింగరేణి యాజమాన్యంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి.

మందా నరసింహారావు, సీఐటీయూ నాయకుడు, కొత్తగూడెం

## పత్తి కొనుగోళ్లకు సమాయత్తం

ఖమ్మం : పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. రైతులకు కనీస మద్దతు ధర వచ్చేలా కసరత్తు మొదలుపెట్టింది. మార్కెటింగ్‌శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. సీసీఐ నిబంధనలకు కఠినతరంగా ఉన్నాయని ఈ ఏడాది పత్తి జిన్నింగ్ మిల్లుల యజమానులు టెండర్లలో పాల్గొనలేదు. ప్రభుత్వం సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వటంతో తిరిగి పాల్గొన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి విపణికి కొత్త పత్తి వచ్చే అవకాశం ఉండటంతో కొనుగోళ్లతో సంబంధం ఉన్న అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు సాగనున్నారు.

మార్గదర్శకాలు ఇలా..కొనుగోళ్లు మొదలు కాకముందే కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, అగ్నిమాపక అధికారి, రెవెన్యూ, పోలీసు, తూనికలు కొలతలు, పరిశ్రమల శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు, హమాలీలు, రైతులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, కమీషన్ ఏజెంట్లు, సీసీఐ అధికారును భాగస్వాములను చేస్తూ పత్తి కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తారు. జిల్లాలోని జిన్నింగు మిల్లులను పత్తి



కొనుగోలు కేంద్రాలుగా కలెక్టర్ నోటిఫై చేస్తారు. మిల్లుల వద్ద, మార్కెట్ యార్డుల్లో అగ్నిమాపక పరికరాల ట్రయల్ రన్ నిర్వహిస్తారు.

రైతులకు ముందస్తుగా టోకెన్లుజిన్నింగ్ మిల్లుల సామర్థ్యం ఆధారంగా పత్తి కొనుగోలు చేసేలా కలెక్టర్ నియంత్రి స్తారు. రైతులు వేచి చూడకుండా ముందస్తుగా టోకెన్లు అందజేస్తారు. పత్తి నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పిస్తారు. కొనుగోలు కేంద్రాలకు పత్తిని లూజుగా తీసుకురావాలి. రైతులకు వెంటనే డబ్బులు అందేలా చూడాల్సి ఉంది. వారంలో ఆరు రోజుల పాటు కొనుగోళ్లు చేయాలి. రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు.

# ఎల్‌ఆర్‌ఎస్ అనండి



హైదరాబాద్: రుసుము చెల్లించి ఇంటి స్థలాన్ని ఎల్‌ఆర్‌ఎస్-2020 పథకం కింద క్రమబద్ధీకరణ చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ పిలుపునిస్తోంది. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో ఫీజు చెల్లించని దరఖాస్తుదారులు ప్రస్తుతం 10 వేల మంది లెక్క తేలారని యంత్రాంగం చెబుతోంది. మరింత మంది షార్ట్‌ఫాల్‌లో చూపిన పత్రాలను సమర్పించడంలో జాప్యం ప్రదర్శిస్తున్నారని, ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఎవరికి వారు ఫోన్ నంబరుతో లాగిన్ అయి, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయాలని, తద్వారా దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తవుతుందని ప్రణాళిక విభాగం గుర్తుచేస్తోంది.

రుసుము ఇలా..

బేసిక్ ఛార్జీలపై క్రమబద్ధీకరణ రుసుమును నిర్ణయించారు. ఆగస్టు 20, 2020 నాటికి భూమి సబ్ రిజిస్ట్రారు విలువ గజం రూ.3వేల లోపు ఉంటే బేసిక్ ఛార్జీలో 25శాతం, రూ.3001 నుంచి రూ.5వేల లోపు ఉంటే 50శాతం, రూ.5001 నుంచి రూ.10వేలలోపు ఉంటే రూ.75శాతం, రూ.10వేలు దాటితే బేసిక్ ఛార్జీ మొత్తాన్ని క్రమబద్ధీకరణ రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది.

పాత పథకాన్నీ పరిశీలించాలని..

ఎల్‌ఆర్‌ఎస్-2015 నోటిఫికేషన్ సమయంలో హెచ్‌ఎండీఏకు 1.75లక్షలు, జీహెచ్‌ఎంసీకి 1.3లక్షల దరఖాస్తులందాయి. వాటి ద్వారా హెచ్‌ఎండీఏకు రూ.1050 కోట్లు, జీహెచ్‌ఎంసీకి రూ.వెయ్యి కోట్ల ఆదాయం సమకూరింది. వాటిలో 40వేలు అపరిష్కృతంగా మిగిలాయి. అలాంటి వారికి 2020 వరకు పరిష్కరించుకునే అవకాశం ఇచ్చినా ఉపయోగించుకోలేదు. కొత్త పథకం 2020లో వచ్చాక పాత పథకం దరఖాస్తుల పరిశీలనకు వీల్లేకుండా పోయింది.

తర్వాత మూడు రెట్ల భారం..

ఎల్‌ఆర్‌ఎస్ కింద ఇప్పుడు క్రమబద్ధీకరించుకుంటే 2020 నాటి భూ విలువ ప్రకారం ఛార్జీలు ఉంటాయని, లేదంటే నిర్మాణ అనుమతి తీసుకునే నాటి భూమి విలువతో 33శాతం జరిమానా, 14శాతం ఓపెన్‌ప్లాట్ డెవలప్‌మెంట్‌ఛార్జీలను చెల్లించి నిర్మాణ అనుమతి తీసుకోవాలని అధికారులు గుర్తు చేస్తున్నారు.

# తప్పని ఎదురుచూపులు



జగిత్యాల : గతేడాది డిసెంబర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నవారు ఆశగా ఎదురుచూస్తున్నారు. వివిధ అవసరాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోగా వాటిని కంప్యూటరీంచారు. 6 గ్యారంటీలతోపాటు వివిధ పథకాల కోసం అర్హులైన 13,58,227 మంది ఆశగా ఎదురుచూస్తున్నారు. మహిళలకు రూ.2500 పింఛన్ కోసం 2,26,404, రాయితీ వంటగ్యాస్ కోసం 2,89,725, రైతులకు రూ.15 వేల కోసం 1,11,733, కౌలు రైతుల కోసం 6,492, రూ.12 వేల కోసం 1,11,131 దరఖాస్తుల వచ్చాయి. నివాసాల కోసం 2,06,226 దరఖాస్తులు రాగా ప్రభుత్వం తొలివిడత నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరివ్వాలని భావిస్తోంది. అమరుల కుటుంబసభ్యులకు ఇళ్ల స్థలం కోసం 310, ఉద్యమకారుల ఇళ్ల స్థలాల కోసం 1675, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు కోసం 2,55,036, దివ్యాంగ పింఛన్ల కోసం 7,259, ఇతర పింఛన్ల కోసం 1,42,236 దరఖాస్తులున్నాయి. దీనికి తోడు రేషన్‌కార్డుల కోసం ఇప్పటి వరకే జిల్లాలో 43,254 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి కొత్తగా దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించడంతో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

అమలవుతున్నవి..జిల్లాలో ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తుండగా జిల్లా వ్యాప్తంగా 2,89,725 కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. గత నెల వరకు 3 లక్షల సిలిండర్ల పంపిణీ జరిగింది. రూ.10.86 కోట్ల రాయితీ వర్తింపజేశారు. గృహజ్యోతి కింద 1,93,686 కుటుంబాలు 200 యూనిట్లలోపు విద్యుత్తు ఉచితంగా ఇచ్చేందుకు అర్హులుగా గుర్తించి అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.7.25 కోట్ల రాయితీ వర్తింపజేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా జిల్లాలో ప్రతి రోజు సుమారు 83 వేలు మంది ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2.20 కోట్ల మంది ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. దీనికి ప్రభుత్వం రూ.88.63 కోట్లు భరించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచగా జిల్లాలో ఇప్పటి వరకు 13,995 మంది వివిధ చికిత్సలు చేయించుకున్నారు.

సన్నవడ్లకు బోనస్..


కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేర్చిన విధంగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయగా జిల్లాలో 58,852 మంది రైతులకు లబ్ధిచేకూరింది. మూడు విడతల్లో రూ.375.57 కోట్ల రుణమాఫీ జరిగింది. అర్హులైన చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎదురయ్యాయని భావించి దరఖాస్తులు స్వీకరించారు. రైతుభరోసా పథకం అమలుకోసం విధివిధానాలు రూపొందిస్తున్నారు. గత ప్రభుత్వం రైతు బంధు కింద ఎకరానికి ఏటా రూ.10 వేలు ఇవ్వగా ప్రస్తుతం ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని భావిస్తున్నారు. సన్నవడ్లకు ప్రోత్సాహకం కింద క్వింటాలుకు రూ.500 ఇస్తామని ముందే ప్రకటించగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ఇవ్వాలని నిర్ణయించారు.

హామీలన్నీ అమలు చేస్తాం

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం. ప్రజాపాలనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పటికే అనేక హామీలు నెరవేర్చాం. ఈసీజన్‌లో సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నాం. వచ్చే నెల 2 నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నాం. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు త్వరలోనే మంజూరిస్తాం.

లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్

# ఇవేం పనులు బాబోయ్..!



కరీంనగర్ : లక్ష్మీనగర్, కారా?నగడ్డ, గాంధీరోడ్డులో రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన మురుగునీటి కాలువ గుండా మురుగునీరు ప్రవహించడం లేదు. ఆ కాలువలోనే ఉండటంతో దోమలు, దుర్వాసన వస్తుండగా నిర్మాణ సమయంలో ఎత్తువంపులు చూడకపోవడం, డ్రైనేజీల్లోనే రాళ్లు, రప్పలు, చెత్తాచెదారంతో నింపేశారు. మారుతీనగర్ చౌరస్తా నుంచి తీగల వంతెనకు వెళ్లే దారిలో అసంపూర్తి పనులు ఇప్పటికి వెక్కిరిస్తున్నాయి.

కరీంనగర్ నగరపాలిక పరిధిలో రూ.కోట్లు వెచ్చించి రోడ్లు, మురుగునీటి కాలువలు, కల్వర్టులు, నడకదారులు నిర్మించారు. పాతికేళ్ల పాటు ప్రజలకు ఉపయోగపడేలా, అభివృద్ధి పనులు చేసేలా ఇంజినీరింగ్ యంత్రాంగం పర్యవేక్షణ పక్కాగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా గుత్తేదారులు తిమ్మిని, బమ్మిని చేసి, మసి పూసి మారేడు కాయ చేసి ఆ పనులను పూర్తి చేసే అక్కడి నుంచి జారుకునే వారున్నారు. బిల్లుల రికార్డుల సమయంలో ఆ లోపాలు బయట పడకుండా హడావుడి చేస్తుండగా చివరికి ప్రజల ఇబ్బందులను అలాగే వదిలేయడం సాధారణంగా మారింది. అదే తరహాలో నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణం పరిశీలిస్తే అవి దేని కోసం నిర్మించారనే ప్రశ్నలు మాత్రం రాక తప్పదు. ఒక్కొక్క చోట ఒక్కోరకంగా పనులు చేయడంతో అందుల్లోంచి నీరు ప్రవహించడం లేదు.

ఎక్కడి మురుగు అక్కడే..నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన మురుగునీటి కాలువల గుండా మురుగునీరు ప్రవహించడం లేదు. ఎక్కడి నీరు అక్కడే ఉండి దుర్గంధంగా మారి, దోమలు, కీటకాలు తయారవుతున్నాయి. వర్షాలకు పలు చోట్ల అవి నిండి ఉండగా అవి ఏర్పడకుండా పైకప్పులు ఉన్నాయి. లక్ష్మీనగర్‌లో అయితే ప్రధాన రహదారి ఎత్తుగా ఉండగా, వీధిలోని మురుగు కాలువ మరి కిందికి తయారైంది. ఆ వీధిలోంచి వచ్చే మురుగు ప్రవాహం అధికమైతే తప్ప అందులోంచి నీరు పూర్తిగా వెళ్లదు. నగరపాలిక పరిధిలో నిర్మించిన కాలువలకు వాలు (స్లోపు) ఏవిధంగా ఉందనే విషయాన్ని కూడా గుర్తించలేదు. మరికొన్ని ప్రాంతాల్లో అయితే కాలువ రెండు వైపులా ఎత్తుగా నిర్మించి మధ్యలో కిందికి చేశారు. దాంతో నీరంతా మధ్యలోనే నిలిచి ఉంటుంది.

పర్యవేక్షణలోనే నిర్లక్ష్యం

అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేకంగా ఉన్నప్పటికీ అంచనాల ప్రకారం పనులు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గుత్తేదారులు సైతం ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కొన్నాళ్లుగా చేపట్టిన పనులు చూస్తే ఆ లోపాలు ఏవిధంగా ఉన్నాయే అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులను తనిఖీ చేయాల్సిన అవసరముంది. జ్యోతినగర్, భాగ్యనగర్, గణేశ్‌నగర్ బైపాసు, అలకాపురి కాలనీ తదితర కాలనీల్లో స్మార్ట్‌సిటీ, ముఖ్యమంత్రి హామీ నిధులు, సాధారణ నిధితో నిర్మించిన మురుగునీటి కాలువలు హడావుడిగా నిర్మించినట్లుగా తయారైంది. ఏ వైపు మురుగు ప్రవహిస్తుందో తెలియదు..కాలువ మధ్యలో కుంగి నీరు అక్కడే నిలిచిన పట్టించుకునే వారే అధికారులు లేరు..పైగా అంతా సవ్యంగా ఉన్నట్లుగా బిల్లులు మాత్రం రికార్డు చేస్తుండటంతో క్షేత్రస్థాయిలో ఆయా కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.

రెండేళ్ల వరకు గుత్తేదారులదే బాధ్యత

అభివృద్ధి పనులు చేసే గుత్తేదారు పనులు పూర్తయిన తర్వాత రెండేళ్ల వరకు బాధ్యత వహించాల్సి వస్తోంది. ధరావతు సొమ్ము (ఈఎండీ) తీసుకునే సమయంలో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి. అవసరమైతే తిరిగి ఆ పనులు చేయించేలా ఆదేశాలు ఇవ్వాలి. ఆర్.యాదగిరి, ఈఈ, నగరపాలిక

# విందామన్నా.. చెప్పేవారేరీ..?

ఖమ్మం : ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులకు తరగతుల వారీగా పాఠాలు చెప్పటం గగనమవుతోంది. అనేకచోట్ల అన్ని తరగతుల విద్యార్థులను ఒక దగ్గర కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఒక తరగతి పాఠ్యాంశాల బోధన జరిగే సమయంలో వేరే తరగతుల విద్యార్థులు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు ఉన్నతాధికారులు సమీప పాఠశాలల నుంచి వేరే వారిని పాఠాలు బోధించేందుకు పంపిస్తున్నారు. అయినా ఒక్కోసారి ఉపాధ్యాయులు రాక పాఠశాలలు మూతపడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

పాఠశాల: కస్బాబజార్(పంపింగ్‌వెల్ రోడ్డు) ప్రాథమిక పాఠశాల, ఖమ్మం అర్బన్ మండలం

విద్యార్థుల సంఖ్య: 32

ఎంత మంది ఉపాధ్యాయులు అవసరం: ముగ్గురు

ఇప్పుడు పనిచేస్తున్న వారెందరు?: ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. మున్నేరు వరద ముంపు ప్రాంతంలో ఈ పాఠశాల ఉంది. జ్వరాలు సోకటంతో ప్రస్తుతం విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. ఇక్కడ అన్ని వసతులతో ఏడు గదులు కలిగిన పటిష్ఠ భవనం ఉంది.

ఉపాధ్యాయుడు సెలవు పెట్టడంతో..

పాఠశాల: గన్యాతండా ప్రాథమిక పాఠశాల, కూసుమంచి మండలం

విద్యార్థుల సంఖ్య: 21



ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం?: ఒకరు

ఇప్పుడు పనిచేస్తున్న వారందెరు?: ఒక ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన సోమవారం సెలవు పెట్టడంతో పాఠశాల నిర్వహణ కోసం సీఆర్‌పీ సుజాతను ఎంఈఓ పంపించారు.

చాలాకాలం నుంచి ఇదే తంతు..

పాఠశాల: బోదనెల్లి ప్రభుత్వ పాఠశాల, చర్ల మండలం

విద్యార్థుల సంఖ్య: 40

ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం: ఇద్దరు

ఇప్పుడు పనిచేస్తున్న వారెందరు?: చాలాకాలం నుంచి ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల అయిన సాధారణ బదిలీల్లో ఈయనకు స్థానచలనం కలిగింది. ఇక్కడికి రావాల్సిన ఉపాధ్యాయుడు అయిష్టత చూపుతున్నారు. అందుకే బదిలీ అయిన ఉపాధ్యాయుణ్ని రిలీవ్ చేయలేదు.

47 మందికి పాఠాలు చెప్పేది ఒక్కరే..

పాఠశాల: అశ్వారావుపేట ప్రాథమిక పాఠశాల

విద్యార్థుల సంఖ్య: 47

ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం: ముగ్గురు

ఇప్పుడు పనిచేస్తున్న వారెందరు?: ఒకరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు 18 సబ్జెక్టులు బోధించాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయులు సెలవు పెట్టే ముందు మండల విద్యాధికారులకు సమాచారమందించాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నచోట్ల ఎవరైనా సెలవు పెడితే సమీప పాఠశాలల నుంచి సర్దుబాటు చేస్తాం. లేనిపక్షంలో కాంప్లెక్స్ పాఠశాల పరిధిలోని సీఆర్‌పీని పంపిస్తాం. అంతేకానీ పాఠశాలలు మూతపడే అవకాశం ఉండకపోవచ్చు. సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

## అందని డబ్బులు.. అవస్థలో రైతులు

మెదక్ : పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తున్నా.. అవి ప్రకటనలకే పరిమితం కావడంతో దిగుబడి తగ్గుతోంది. దీనికితోడు ప్రభుత్వ డెయిరీలో పాలు పోసే పాడి రైతులకు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లును రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. కానీ గత నెల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కథనం... రోజువారీ ఖర్చులకు పాలు పోసే రైతులు వ్యవసాయం, పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగించే వారు. గత నెల నుంచి డెయిరీ నుంచి డబ్బులు జమకాకపోవడంతో డ్వాక్రా గ్రూప్‌తో పాటు తదితర చిట్టి డబ్బులు, రోజు వారి ఖర్చులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ప్రభుత్వం లీటర్‌కు రూ.4 చొప్పున అదనంగా ఇచ్చే ప్రోత్సాహకం అందకపోవడంతో పాటు పాలకు వచ్చే డబ్బులు సైతం రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తే సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసం చేస్తారని, ప్రభుత్వ సంస్థలకు తక్కువ ధరకు అయిన పాలు పోస్తున్న రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని వాపోతున్నారు.

విక్రయాలు సాగక

గతంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న డెయిరీల వద్దనే పాల విక్రయాలు



చేపట్టడంతో పాటు ఆ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, ఆస్పత్రులు, గురుకుల పాఠశాల, కళాశాలల తదితర వాటికి విజయ సంస్థతో పాటు ప్రభుత్వ రంగ సంస్థ పాలు మాత్రమే సరఫరా చేసేవారు. దీంతో ప్రతి రోజుకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70వేల లీటర్ల పాల విక్రయాలు జిల్లాల్లోనే జరిగేవి. ప్రస్తుతం పాల విక్రయాలు సకాలంలో జరగకపోవడంతో వాటిని పొడిగా మార్చుతున్నారనే సమాచారం. ఆ పొడి వెంటనే విక్రయించడం సాధ్యం కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బకాయిలు పేరుకుపోతున్నాయి. గతంలో మాదిరిగానే ప్రభుత్వ రంగ సంస్థలకు పాలను సరఫరా చేసేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుంటే వీటి ద్వారా రోజుకు రూ.2-3లక్షల వరకు సమకూరే అవకాశం ఉంటుందని ఆ శాఖలోని కొందరు అధికారులు తెలిపారు.

జులై వరకు ఇచ్చేశాం: గోపాల్ సింగ్, డీడీ మెదక్ విజయ డెయిరీ

గతంలో మాదిరిగా పాల బిల్లులు విడుదల కాని మాట వాస్తవమే. జులై వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు పూర్తిగా చెల్లించాం. ప్రస్తుతం ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 16వ తేదీ వరకు సంబంధించిన బిల్లులు రూ.50 లక్షలు మాత్రమే రావాల్సి ఉంది. సంబంధిత మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తీసుకునే అవకాశం ఉంది.



## కుప్పంలో వైకాపాకు షాక్.. తెదేపాలో చేరిన కీలక నేత

కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పంలో వైకాపాకు షాక్ తగిలింది. ఆ పార్టీకి కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ రాజీనామా చేశారు. వైకాపాతో పాటు మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ఛైర్మన్ పదవికి సంబంధించిన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు పంపారు. అనంతరం అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో డాక్టర్ సుధీర్ తెదేపాలో చేరారు. ఆయనకు సీఎం పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## రూ.10లక్షల కోట్ల అప్పుతో ఖజానాను జగన్ ఖాళీ చేశారు: మంత్రి నారాయణ



కాకినాడ: మూడు పార్టీలు కూటమిగా కలిసి ఉన్నప్పుడు చిన్నపాటి సమస్యలు ఉంటాయని.. కూర్చొని మాట్లాడుకుంటే అవి పరిష్కారమవుతాయని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా బాధ్యతలు ఇచ్చిన అనంతరం తొలిసారిగా ఆయన కాకినాడకు వచ్చారు. తెదేపా, జనసేన, భాజపా నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో నారాయణ మాట్లాడారు. "కూటమి పార్టీల్లో ఎలాంటి కుమ్ములాటలు లేవు. సీఎం ఆదేశాల ప్రకారం మూడు పార్టీల సమన్వయంతో పాటు ప్రజా సమస్యలపై ఇన్‌ఛార్జ్ మంత్రిగా ప్రత్యేక దృష్టి సారిస్తాను. ఎన్నికల కోడ్ ఉండటంతో అధికారులతో సమీక్ష నిర్వహించలేదు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు తమ నియోజకవర్గ అభివృద్ధిపైనే ఎక్కువగా చర్చించారు. రూ.10లక్షల కోట్ల అప్పుతో రాష్ట్ర ఖజానాను జగన్ ఖాళీ చేసి వెళ్లిపోయారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా వాడేశారు. అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేశారు. తన అనుభవంతో సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఖజానా ఖాళీ అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. మూడేళ్లలో అమరావతి పనులు పూర్తి చేస్తాం. రాజధానిపై 2014 లోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. ఏపీ రాజధాని అమరావతే అని కేంద్రం కూడా పార్లమెంట్‌లో సమాధానం ఇచ్చింది. ఇన్‌ఛార్జ్ మంత్రిగా కాకినాడ జిల్లాకు నెలకు మూడుసార్లు వస్తాను. అన్ని సమస్యలు పరిష్కరిస్తాను. పెండింగ్‌లో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు త్వరలో ఎన్నికలు జరిపేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై దృష్టి పెట్టాలని నేతలకు సూచించాను"అని నారాయణ తెలిపారు.

## విద్యుత్ చార్జీలపై వైఎస్ షర్మిల




విజయవాడ: విద్యుత్ ఛార్జీలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల గళమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల గురించి ప్ర స్తావించారు. ఆ పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాల్సింది పోయి, ఆ పాపపు పరిహారాన్ని ప్రజల నెత్తిన మోపేందుకు కూటమి సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రూ.18వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల వసూళ్ల విషయంలో మా తప్పేం లేదని, మాకసలు సంబంధమే లేదని, భారం మాది కాదని, ప్రజల మీదే ఆ మొత్తాన్ని మోపుతున్నారని విరుచుకుపడ్డారు.

**ప్రజలకు కరెంట్ షాక్ :** విద్యుత్ ఛార్జీల గురించి కూటమి ప్రభుత్వ తీరును వైఎస్ షర్మిల తప్పు పట్టారు. 'విద్యుత్ ఛార్జీలపై సర్కార్‌ది సర్దుబాటు కాదు ఇది, ప్రజలకు "సర్దుపోటు". కూటమి సర్కారు ప్రజలకు ఇచ్చిన భారీ కరెంటు షాక్. విద్యుత్ ఛార్జీల విషయంలో వైసీపీ చేసింది పాపం అయితే రాష్ట్ర ప్రజలకు కూటమి సర్కార్ పెడుతుంది శాపం. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఏం సంబంధం? ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తే పడే అదనపు భారం ప్రజల నెత్తిన మోపుతారా ? ఐదేళ్లలో వైసీపీ భారం రూ.35 వేల కోట్లు అయితే 5 నెలల్లో కూటమి భారం రూ.18 వేల కోట్లా? వైసీపీకి మీకు ఏంటి తేడా ? వైసీపీ 9 సార్లు ఛార్జీలు పెంచిందని, కూటమి అధికారంలో కొస్తే ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచమని, అవసరం అయితే 30 శాతం తగ్గించేలా చూస్తాం అని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలపై కట్టుబడి ఉంటే, తప్పు ఎవరు చేసినా ఆ భారాన్ని ప్రజలపై మోపొద్దనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనే రూ.18 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయండి అని' వైఎస్ షర్మిల ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


**ప్రధానిని అడగండి...** 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై పడుతున్న భారంపై నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీని గల్లా పట్టి అడగండి. ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేస్తే ఊరుకోబోం. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ హెచ్చరిస్తోంది. ప్రజల ముక్కు పిండి ట్రూఅప్ ఛార్జీల రూపంలో, అధిక కరెంటు బిల్లులు వసూల్ చేయడం దారుణం. వసూల్ చేయడాన్ని నిరసిస్తూ రేపటి నుంచి మూడు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తున్నాం అని' వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

## వ్యవసాయం, ఆక్వా రంగాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది



బాపట్ల జిల్లా: బాపట్ల జిల్లాలో టూరిజాన్ని ప్రోత్సహించి, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లాలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, ఇన్ చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి పర్యటించారు. కర్లపాలెం మండలం యాజిలి వద్ద మంత్రులు రోడ్డు గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మీడియాతో మాట్లాడుతూ.... వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లే దర్శనం ఇస్తున్నాయని మండిపడ్డారు. యుద్ధ ప్రాతిపదికన గుంతలు పూడ్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.826 కోట్లు కేటాయించిందన్నారు. నెల రోజుల్లో ప్రయాణికులకు ఇబ్బంది లేని రోడ్లను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా దీపం పథకం–2ను ప్రారంభించినట్లు తెలిపారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు.

## వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యే.. మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ కన్నుమూత



చీడికాడ: తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ (99) కన్నుమూశారు. మంగళవారం ఉదయం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం పెదగోగాడలో ఆయన తుదిశ్వాస విడిచారు. వయసురీత్యా వచ్చిన అనారోగ్య కారణాలతో మృతిచెందారు. గతంలో మాడుగుల నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెదేపా తరఫున వరుసగా 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో ఆయన బరిలో నిలిచి విజయం సాధించారు. ఎన్టీఆర్ హయాంలో మంత్రిగానూ పనిచేశారు. పశుసంవర్ధక శాఖ బాధ్యతలు నిర్వర్తించారు.

రెడ్డి సత్యనారాయణ మృతి పట్ల వివిధ పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

**సీఎం చంద్రబాబు సంతాపం :** రెడ్డి సత్యనారాయణ మృతిపై తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాడుగుల నియోజకవర్గ అభివృద్ధికి సత్యనారాయణ ఎనలేని కృషి చేశారన్నారు.

రెడ్డి సత్యనారాయణ మృతి పట్ల మంత్రి లోకేశ్ సంతాపం తెలిపారు. నిరాడంబర ప్రజా సేవకుడిని పార్టీ కోల్పోయిందని పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్ వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పూ లేదు: హెూంమంత్రి వంగలపూడి అనిత



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యాచార ఘటనలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు హెూంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఉప ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పు లేదని ఆమె అన్నారు. పవన్ ఏ కేసు విషయంలో ఆగ్రహంతో మాట్లాడారో తెలుసని, త్వరలోనే దాని గురించి ఆయనతో మాట్లాడతానని అనిత చెప్పుకొచ్చారు. ఏపీలో శాంత్రిభద్రతల విషయమై సీఎం చంద్రబాబు, తాను పోలీసులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు హెూంమంత్రి తెలిపారు. ఆ చర్చల్లో పవన్ కూడా భాగమేనని అన్నారు. ఉప ముఖ్యమంత్రికి అన్నీ విషయాలు తెలుసని, ఆయన మాట్లాడిన దాంట్లో ఎటువంటి తప్పూ లేదని అనిత చెప్పారు.




## గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ షురూ.. 43 నుంచి 28కి చేరనున్న బ్యాంకులు!

దిల్లీ: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను మరింత సమర్థంగా నిర్వహించడం, ఖర్చులను నియంత్రణ కోసం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను కేంద్రం విలీనం చేయాలని చూస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా ఈ ప్రక్రియ జరగ్గా.. నాలుగో దఫా ఏకీకృత ప్రక్రియను చేపట్టేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు మొదలు పెట్టింది. దీంతో ప్రస్తుతం ఉన్న గ్రామీణ బ్యాంకుల సంఖ్య 43 నుంచి 28కి తగ్గనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్ సిద్ధమైంది. విలీన ప్రక్రియలో భాగంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న 15 ఆర్ఆర్‌బీలు విలీనం కానున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 4, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన 3, బిహార్, గుజరాత్, జమ్మూకశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లో రెండేసి ఆర్ఆర్‌బీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ విలీన ప్రక్రియ అప్పులు, ఆస్తుల సర్దుబాటుకు లోబడి జరుగుతుంది. ఒకే రాష్ట్రం– ఒకే ఆర్ఆర్‌బీ వల్ల ఆయా బ్యాంకుల పనితీరు మెరుగవుతుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన అధికారి ఒకరు తెలిపారు.

ప్రస్తుతం నాబార్డ్‌తో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులకు రుణాలివ్వడానికి ఆర్ఆర్‌బీ చట్టం, 1976 కింద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఏర్పడ్డాయి. వీటి యాజమాన్య నిర్మాణం ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం 50% వాటా ఉంది. మిగిలిన 50 శాతంలో ప్రాయోజిత బ్యాంకుకు (స్పాన్సర్) 35%, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి 15% వాటాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) 5 గ్రామీణ బ్యాంకులున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు.. చిత్తూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి.



## వైకాపా సైకోలు భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెబుతారా?: అనిత

అనంతపురం: వైకాపా హయాంలో జరిగిన అరాచకాలను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు హెూం మంత్రి అనిత తెలిపారు. వైకాపా సైకో బ్యాచ్ అసత్యాలను ప్రచారం చేస్తూ.. ప్రజలను భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమంతోపాటు వారికి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏమీ జరగకపోయినా.. ఏదేదో జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను వైకాపా సైకోలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. "గత ప్రభుత్వ హయాంలో జగన్ ఇంటి భద్రత కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు వైకాపా దుష్టపాలన పాపాలే కారణం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. పోలీసులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సాంకేతికంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తాం" అని అనిత స్పష్టం చేశారు.




అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఐదేళ్ల క్రితం జరిగిన ఆంధ్రజ్యోతి విలేకరి హత్య కేసులో తుని రూరల్ పోలీసులు రాజాపై కేసు నమోదు చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించగా చుక్కెదురైంది. తుని నియోజకవర్గం తొండంగి మండల ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేస్తున్న కాతా సత్యనారాయణ (47).. 2019 అక్టోబరు 15న రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని ఇంటికి వెళ్తున్నారు. అక్కడి లక్ష్మీదేవి చెరువుగట్టుపై కొందరు అడ్డగించి కత్తులతో నరికి చంపారు. హత్యకు దాడిశెట్టి రాజా సూత్రధారి అనేది మృతుని కుటుంబీకుల ఆరోపణ. వారి ఫిర్యాదుతో తుని రూరల్ పోలీసులు కేసు నమోదుచేశారు. దాడిశెట్టి సహా ఆరుగురిని నిందితులుగా చేర్చారు. రాజా మంత్రి అయ్యాక దర్యాప్తు ముందుకు సాగలేదు. 2023లో ఛార్జిషీటులో ఆయన పేరు తప్పించారు. నిందితులను శిక్షించాలంటూ సత్యనారాయణ సోదరుడు, న్యాయవాది కాతా గోపాలకృష్ణ పోరాడారు. రాజాపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎన్‌హెచ్ఆర్‌సీతో పాటు.. హైకోర్టును ఆశ్రయించారు. తుని నియోజకవర్గంలోకి యువగళం పాదయాత్ర వచ్చినప్పుడు నారా లోకేశ్‌ను కలిసి న్యాయం చేయాలని విన్నవించారు. కూటమి ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తామని లోకేశ్ అప్పట్లో భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో దాడిశెట్టి రాజాపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రాజెక్టులపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష

అమరావతి, నవంబర్ 5: నవంబర్ నెల నుంచే ప్రాధన్యతా ప్రాజెక్టుల పనులు ప్రారంభంకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విషయం తెలిసిందే. సీఎం ఆదేశాలను అమలు చేసేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు వరుస సమీక్షలు నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, చింతలపూడి,గోదావరి–పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టులపై ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ఏజెన్సీలతో విజయవాడ క్యాంపు కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, మేఘా ఇంజనీరింగ్ ఏజెన్సీ ఈ సమావేశానికి హాజరయ్యారు. రేపటి (బుధవారం) నుంచి పోలవరం ధయా ఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ నిర్మాణానికి సంబంధించి నిపుణులతో వర్క్ షాప్ నిర్వహణపై సమావేశంలో చర్చించనున్నారు. వెలిగొండ ప్రాజెక్టులో గత ప్రభుత్వం చేసిన వైఫల్యాలను, దెబ్బతిన్న ఫీడర్ కెనాల్‌పై సమగ్ర రిపోర్టును తయారు చేసి సీఎం చంద్రబాబు నాయుడికి మంత్రి నిమ్మల రామానాయుడు అందివ్వనున్నారు. ఇటీవల దోర్నాల మండలం కొత్తూరు వద్ద నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్‌ను ముగ్గురు మంత్రులు నిమ్మల రామానాయుడు, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్ట్ విషయంలో గత ప్రభుత్వం వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు మంత్రులు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే జగన్ జాతికి అంకితం చేశారని మండిపడ్డారు. 2014–19లో గత టీడీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1373 కోట్లు కేటాయించి.. రూ.1319 కోట్లు ఖర్చు చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గత అయిదేళ్ళ జగన్ పాలనలో రూ.3518 కోట్ల బడ్జెట్ కేటాయించి, కేవలం రూ.170 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారన్నారు. జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారిందని విమర్శించారు. రెండు దశల్లో వెలిగొండ ప్రాజెక్టును వెనువెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని తెలిపారు. ఫేజ్–1లో హెడ్ వర్క్స్, రెండు టన్నెల్స్ , ఫీడర్ ఛానెల్, రిజర్వాయర్, రెగ్యులేటర్ వంటి నిలిచినపోయిన పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నాటికి 1.19 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి వెల్లడించారు. తాను అధికారంలోకి వస్తే ఏడాదిలోగా వెలిగొండ పూర్తి చేస్తానన్న జగన్ ఐదేళ్లపాటు ఏం చేశారని మంత్రి డోలా వీరాంజనేయ స్వామి ప్రశ్నించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా, పరిహారం ఇవ్వకుండా ప్రారంభోత్సవం చేసి జిల్లా ప్రజల్ని జగన్ మోసం చేశారని మండిపడ్డారు. 2014 – 19 లోనే మెజార్టీ పనులు పూర్తి చేశామన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయన్నారు. వెలిగొండ ప్రారంభించింది చంద్రబాబు నాయుడే అని.. పూర్తి చేసేది కూడా చంద్రబాబు నాయుడే అని మంత్రి డోలా స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టును జగన్ జాతికి అంకితం చేస్తే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశారని భావించామని.. కానీ ప్రాజెక్టు వద్ద దారుణమైన పరిస్థితులు ఉన్నాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రాజెక్టులు నాశనం అయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో వెలిగొండ ప్రాజెక్టును చంద్రబాబు పూర్తి చేస్తారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

## చీరకట్టులో బాపుబొమ్మలా కావ్య థాపర్

టాలీవుడ్ లో కమర్షియల్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తోన్న ముద్దుగుమ్మ కావ్య థాపర్. రీసెంట్ గా ఈ బ్యూటీ గోపీచంద్ 'విశ్వం' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అయితే కావ్య థాపర్ కి టైం సరిగా కలిసి రావడం లేదని చెప్పొచ్చు. అందుకే స్టార్ హీరోలతో మూవీస్ చేస్తోన్న బ్యాక్ టూ బ్యాక్ డిజాస్టర్స్ అందుకుంటుంది. కావ్య థాపర్ హీరోయిన్ గా నటించిన 'ఈగల్', 'ఊరు పేరు భైరవకోన', 'డబుల్ ఇస్మార్ట్', 'విశ్వం' ఈ ఏడాది రిలీజ్ అయ్యాయి. అయితే ఈ సినిమాలన్నీ డిజాస్టర్ అయ్యాయి. సినిమాలలో గ్లామర్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్న కూడా కావ్య థాపర్ కి ఏ మాత్రం కలిసి రాలేదని చెప్పాలి. అయితే ఈ సినిమాలు ఫ్లాప్ అయిన కావ్య థాపర్ ఇండస్ట్రీలో అందరి దృష్టిలో పడింది. దీంతో టైర్ 2 హీరోలకి ఆమె ఛాయస్ గా మారింది. ఆమె మరికొన్ని కమర్షియల్ సినిమాలకి కూడా హీరోయిన్ గా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే టాక్ వినిపిస్తోంది. డిజిటల్ ఎంట్రీ కూడా



ఇచ్చిన కావ్య థాపర్ 2023లో విజయ్ సేతుపతి ఫర్జీలో నటించింది. ఈ సిరీస్ కి మంచి టాక్ వచ్చింది. ఇదిలా ఉంటే కావ్య థాపర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన అప్డేట్స్ తో పాటు గ్లామర్ ఫోటోలని కూడా కావ్య థాపర్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలకి లక్షల్లో లైక్స్ వస్తాయి. ఎప్పుడు గ్లామర్ అవుట్ ఫిట్స్ తో కనిపించే కావ్య థాపర్ సడెన్ గా చక్కనైన చీరకట్టులో మెస్మరైజ్ చేసే ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. వైట్ కలర్ చీరలో ఆమె అచ్చమైన తెలుగమ్మాయిలా, అందమైన బాపు బొమ్మలా ఉందనే మాట వినిపిస్తోంది.

నెటిజన్లు కూడా కావ్యా థాపర్ ఫోటోపై ఇంటరెస్టింగ్ కామెంట్స్ చేస్తున్నారు. ఇలా ట్రెడిషనల్ స్టైల్ క్యారెక్టర్ కావ్య థాపర్ కి పడితే కచ్చితంగా ఆకట్టుకుంటుందని అనుకుంటున్నారు. ఒక్క సినిమాతో కమర్షియల్ బ్రేక్ పడితే ఆమె టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మారిపోతుందని అంటున్నారు. ఈ ఏడాది ఆమెకి ఏ విధంగా కలిసి రాలేదు. వచ్చే ఏడాది అయిన కావ్య థాపర్ కెరియర్ ని టర్న్ చేసే సినిమా పడుతుందేమో వేచి చూడాలి.

## మరోసారి డోస్ పెంచిన 'రాజా సాబ్' భామ

చూపు తిప్పుకోకుండా చేసే అందం, ఆకట్టుకునే అభినయంతో సినిమా రంగంలో తనదైన మార్కును చూపిస్తూ దూసుకుపోతోన్న లేడీ మాళవిక మోహనన్. ఫేమస్ సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్ కుమార్తెగా సినీ ప్రపంచానికి పరిచయం అయిన ఈ అమ్మడు.. 2013లోనే హీరోయిన్‌గా ప్రయాణాన్ని మొదలు పెట్టింది. కానీ, ఆ తర్వాత అంత వేగంగా సినిమాలు చేయడంలో మాళవిక విఫలం అయింది. మలయాళ ఇండస్ట్రీ నుంచి హీరోయిన్‌గా వచ్చిన మాళవిక మోహనన్.. ఆ తర్వాత దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ సినిమాలు చేసింది. అయితే, సుదీర్ఘమైన ప్రయాణంలో కొన్నింటిలో మాత్రమే మెరిసింది. ఇక, ఇప్పుడు మాళవిక మోహనన్.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న 'ది రాజా సాబ్'లో హీరోయిన్‌గా చేస్తోంది. అలాగే, కార్తీ సరసన 'సర్దార్ 2' సినిమాను కూడా చేస్తూ ఫుల్ బిజీగా గడుపుతోంది. గతంలో కంటే ఇప్పుడు ఎంతో వేగంగా సినిమాలు చేస్తోన్న మాళవిక మోహనన్.. వీలైనంత ఎక్కువ సమయాన్ని సోషల్ మీడియాలోనే గడుపుతోంది. ఆ విషయం



గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ రూట్లోనే అమ్మడు తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్‌కు సంబంధించిన ఎన్నో విషయాలు, విశేషాలను తన అభిమానులతో పంచుకుంటోంది. తద్వారా తన ఫాలోయింగ్‌ను పెంచుకుంటోంది. సౌత్ ఇండియన్ హీరోయిన్, అందాల భామ మాళవిక మోహనన్ సోషల్ మీడియా వేదికగా ఊహించని గ్లామర్ ను హైలెట్ చేస్తోంది. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఈ స్టార్ డాటర్ మరింత ఎక్కువగా గ్లామర్ డోస్ పెంచేసింది. ఇందులో భాగంగానే తాజాగా మాళవిక మోహనన్ డిజైనర్ ట్రేడీషనల్ డ్రెస్‌లో దిగిన కొన్ని ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. మాళవిక మోహనన్ తాజాగా షేర్ చేసిన ఫొటోల్లో ఆమె అందాలు ఓ రేంజ్‌లో హైలైట్ అవుతున్నాయి. ఇంకేముంది.. ఈ పిక్స్‌కు నెటిజన్ల నుంచి అదిరిపోయే రీతిలో స్పందన లభిస్తోంది. ఫలితంగా 'ది రాజా సాబ్' హీరోయిన్ షేర్ చేసిన ఈ ఫొటోలు క్షణాల్లోనే ఫుల్ వైరల్ అయిపోయాయి. ఇక, ఈ పిక్స్‌కు చాలా మంది కుర్రాళ్లు తమదైన రీతిలో కామెంట్లను చేస్తూ హైలైట్ చేస్తున్నారు.




## నిహారిక గ్యాంగ్ గ్లామర్ బ్లాస్ట్



మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన ఏకైక హీరోయిన్ నిహారిక.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. యాంకర్ గా కెరీర్ స్టార్ట్ చేసిన అమ్మడు.. అనేక షార్ట్ ఫిల్మ్ లో నటించారు. ముద్దపప్పు ఆవకాయ్, నాన్న కూచి వంటి పలు లఘుచిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు. ఆ తర్వాత యంగ్ హీరో నాగచైతన్య ఒక మనసు మూవీతో హీరోయిన్ గా మారారు. డెబ్యూ చిత్రంలో తన యాక్టింగ్ తో అలరించారు. విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా దక్కించుకున్నారు. ఆ తర్వాత హీరోయిన్ గా వరుస సినిమాలు చేశారు నిహారిక. కానీ అనుకున్నంత స్థాయిలో హిట్స్ సాధించలేకపోయారు. సూర్య కాంతం మూవీతో మోస్తరు హిట్ ను సొంతం చేసుకున్నారు. అదే సమయంలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పేరుతో నిర్మాణ సంస్థను స్టార్ట్ చేశారు. తన బ్యానర్ పై పలు వెబ్ సిరీస్ లు నిర్మించారు. రీసెంట్ గా కమిటీ కుర్రోళ్ళు సినిమాను రూపొందించారు. ఆగస్టులో రిలీజ్ అయిన ఆ మూవీ సూపర్ హిట్ అయ్యి నిర్మాతగా నిహారికకు సక్సెస్ తెచ్చి పెట్టింది. ఓవైపు నిర్మాతగా వ్యవహరిస్తూనే.. మరోవైపు సినిమాల్లో కూడా నటిస్తున్నారు నిహారిక. టాలీవుడ్ హీరో మంచు మనోజ్ తో కలిసి వాటి ది ఫిష్ లో యాక్ట్ చేస్తున్నారు. ఇప్పటికే ఆమెకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ అయి ఆకట్టుకుంది. కోలీవుడ్ లో మరో సినిమా చేస్తున్నారు మెగా డాటర్. మద్రాస్ కారన్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మలయాళం హీరో ఆర్డీఎక్స్ ఫేమ్ షేన్ నిగమ్ సరసన నటిస్తున్నారు. అదే సమయంలో తన ఫ్రెండ్స్ తో ఎప్పటికప్పుడు వెకేషన్స్ అండ్ పార్టీస్ కు హాజరవుతుంటారు నిహారిక. ఈ మధ్యకాలంలో వితికా షేరు, మహాతల్లి జానుతో నిహారిక ఎక్కువ కనిపిస్తున్నారు. టూర్స్ కు వెళు న్నారు. పార్టీలు చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన పిక్స్ ఎవరో ఒకరు ఇన్స్ స్టాలో షేర్ చేస్తున్నారు. వాటి కింద కామెంట్స్ తో తమ ఫ్రెండ్ షిప్ ను వ్యక్తపరుస్తున్నారు. రీసెంట్ గా మహాతల్లి జాను కొత్త పిక్ ను షేర్ చేశారు. అంతా కలిసి బ్రంచ్ కు వెళ్లినట్లు క్యాప్షన్ ఇచ్చారు. అంతా ఫుల్ ఫన్నీగా గడుపుతూ ఫోటో దిగినట్లు ఈజీగా తెలుస్తుంది. అందులో నిహారిక స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తున్నారు. వైట్ కలర్ డ్రెస్ వేసుకున్న మెగా డాటర్ తన నవ్వుతో మాయ చేస్తున్నారు. తన స్టిల్స్ ఫిదా చేస్తున్నారు. సింపుల్ గా కనిపిస్తూనే ఆకట్టుకుంటున్నారు. తన లుక్స్ తో మైమరపిస్తున్నారు. ప్రస్తుతం ఆ ఫోటో వైరల్ గా మారగా.. నెటిజన్లు తెగ స్పందిస్తున్నారు. నిహారిక గ్యాంగ్ పిక్ సూపర్ అని కామెంట్లు పెడుతున్నారు. గ్లామర్ బ్లాస్ట్ అదిరిపోయిందని చెబుతున్నారు.

## బాలయ్య.. 'క్లైమాక్స్'కు వేళాయే!



టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ.. ప్రస్తుతం NBK 109 మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా అఖండ-2 పూజా కార్యక్రమాలు జరగ్గా.. ఇప్పుడు NBK 109 సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నారు బాలయ్య. పక్కా మాస్ ఎంటర్టైనర్ గా చిత్రాన్ని బాబీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నడూ చూడని రీతిలో బాలయ్యను వైలెంట్ గా చూపిస్తానని బాబీ ఇప్పటికే పలుమార్లు తెలిపారు. అయితే కొద్ది రోజుల క్రితం విడుదలైన గ్లింప్స్.. మంచి రెస్పాన్స్ అందుకుంది. అందులో బాలయ్యను ఓ రేంజ్ లో చూపించారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న NBK 109 మూవీకి డాకు మహారాజ్, వీర మాస్, సర్కార్ సీతారాంలో ఏదో ఒక టైటిల్ ఫిక్స్ చేశారని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. దీపావళికి అనౌన్స్మెంట్ వస్తుందని అంతా అనుకోగా.. రాలేదు. దీపావళి పండగకు టైటిల్ ను విజువల్స్ తో సహా రూపొందించి అనౌన్స్ చేద్దామనుకున్నామని, సీజీ వర్క్ అవ్వలేకపోవడం వల్ల ఇవ్వలేకపోతున్నామని NBK 109 నిర్మాత నాగ వంశీ రీసెంట్ గా తెలిపారు. నవంబర్ రెండో వారంలో అప్డేట్ ఇస్తామని చెప్పారు. దీంతో అంతా అప్డేట్ కోసం వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు కొత్త అప్డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమా క్లైమాక్స్ ను షూట్ చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేస్తున్న మేకర్స్.. కొత్త షెడ్యూల్ లో క్లైమాక్స్ ను చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అందుకు బాలయ్య కూడా పవర్ ఫుల్ గా సిద్ధం అవుతున్నారని వార్తలు వస్తున్నాయి. నెవ్వర్ బిఫోర్ అనేలా క్లైమాక్స్ ను మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ షూట్ అయ్యాక.. బాలయ్య తన డబ్బింగ్ పార్ట్ ను పూర్తి చేయనున్నట్లు టాక్.

ఇక సినిమా విషయానికొస్తే.. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై భారీ బడ్జెట్ తో నాగవంశీ, సాయి సౌజన్య గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. చాందినీ చౌదరి, ఊర్వశీ రౌతేలా ఫిమేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. మరి పొంగల్ బరిలో దిగనున్న NBK 109 సినిమా ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## చీరలో కాజల్ సోదరి నిషా అందం

నిషా అగర్వాల్ .. పరిచయం అవసరం లేదు. కాజల్ అగర్వాల్ గారాల చెల్లెలు. తెలుగు సినిమా కథానాయికగాను సుపరిచితురాలు. సోదరీమణుల మధ్య గొప్ప అనుబంధం ఆకర్షిస్తుంది.. అయితే నిషా అగర్వాల్ కొన్నేళ్ల పాటు సినిమాల్లో నటించినా కానీ, తన సోదరి కాజల్ కంటే ముందే పెళ్లి చేసుకుని లైఫ్ లో సెటిలైంది. తన భర్త పిల్లలు కాపురం అంటూ తన పంథాలో ఉంది. నిషా ఫ్లాష్ బ్యాక్ లోకి వెళితే.. తెలుగులో పలు చిత్రాల్లో నటించింది. వరుణ్ సందేశ్ .. నారా రోహిత్ లాంటి యువహీరోల సరసన హిట్ చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత కెరీర్ ఆశించిన రేంజుకు చేరకపోవడంతో పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంది. ముంబైకి చెందిన వ్యాపారవేత్త కరణ్ వలేచాను 2013 డిసెంబర్ 28 న పెళ్లాడింది నిషా. ఈ జంటకు కిడ్స్ ఉన్నారు. కెరీర్ జర్నీలో వరుణ్ సందేశ్ - నిషా జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా ఏమైంది ఈవేళ బాక్స్ ఆఫీస్ వద్ద విజయం సాధించింది. తదుపరి చిత్రం



సోలో మంచి విజయం అందుకుంది. నారా రోహిత్- నిషా అగర్వాల్ జంటకు ఇది బ్లాక్ బస్టర్ మూవీ. 2011 చివరిలో ఈ మూవీ విడుదలైంది .ఇందులో నిషా మెడికల్ కాలేజీ విద్యార్థిగా నటించగా రోహిత్ వీర ప్రేమికుడిగా కనిపించాడు. ఆ తర్వాత ఏమైంది ఈవేళ రీమేక్ %-%ఇష్టం%-% (2012) చిత్రంతో నిషా తమిళంలో అడుగుపెట్టింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. 2013 లో సుకుమరుడులో నటించింది. భయ్య భయ్య తో మలయాళ చిత్ర పరిశ్రమలోనూ ప్రవేశించింది. అటుపై చివరిసారిగా మలయాళ చిత్రం కజిన్స్ లో కనిపించింది. నిషా అగర్వాల్ పెళ్లి చేసుకున్న తర్వాత నటనను విరమించాలని నిర్ణయించుకుంది. 27 అక్టోబర్ 2018 న ఈ జంటకు ఇషాన్ వలేచ అనే కుమారుడు కలిగాడు. నిషా ఇటీవల సోషల్ మీడియాల్లో స్పీడ్ గా ఉంది. నిరంతరం ఫోటోషూట్లను షేర్ చేస్తూ, కొన్ని వాణిజ్య ప్రకటనలను షేర్ చేస్తూ ఆదాయ ఆర్జన చేస్తోంది. అయితే నిషా నటనలో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించే ఆలోచనలో ఉందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి.

## 'అఖండ 2'లో ఈ భామకు ఛాన్స్?

'కంచె' బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ బోల్డ్ ఫ్యాషన్ ఎంపికలు ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తాయి. ట్రెడిషనల్ లుక్ లోను హాలి కంటెంట్‌ని అందించడంలో ప్రగ్య ప్రత్యేకత వేరు. ఇటీవల లోదుస్తుల బ్రాండ్ల ప్రచారంలో స్పీడ్ పెంచిన ప్రగ్య, కెల్విన్ క్లెయిన్ లాంటి పాపులర్ బ్రాండ్ కి ప్రచారం చేసింది. ప్రతిసారీ ప్రగ్య బోల్డ్ ఫోటోషూట్లు అంతర్జాలంలో సంచలనంగా మారాయి. కానీ ఇప్పుడు దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రగ్య ఫ్యాషన్ ఎంపికలు హాట్ టాపిక్ గా మారాయి. ఇటీవలే తన స్నేహితురాళ్లు రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మితో కలిసి దీపావళి పార్టీలో సందడి చేసింది ప్రగ్య. ముంబైలో



జరిగిన ఈ పార్టీలో స్నేహితులంతా ఫుల్‌గా చిల్ అయ్యారు. పార్టీ నుంచి ప్రగ్య ట్రెడిషనల్ అవతార్ కి సంబంధించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. ఇంతలోనే ఇప్పుడు మరో కొత్త లుక్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఈసారి సాంప్రదాయ లెహంగా ధరించిన ప్రగ్య పాక్షికంగా అందాలను ఎర వేసే స్లీకీ బ్లౌజ్‌లో మత్తెక్కించింది. తుహినా శ్రీవాస్తవ రూపొందించిన అద్భుతమైన ఆకుపచ్చ రంగు దుస్తులు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఎంపిక చేసుకున్న దుస్తులకు తగ్గట్టుగా డిజైనర్ ఆభరణాలు అంతే ఆకట్టుకున్నాయి. ప్రగ్య అందమైన స్టైల్, ఆహార్యం యువతరాన్ని క్లీన్ బౌల్డ్ చేస్తున్నాయి.

ఇటీవల ప్రగ్య ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహించిన 'ఖేల్ ఖేల్ మే' అనే కామెడీ డ్రామాలో గ్లామరస్ క్వీన్ పాత్రలో కనిపించింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్, తాప్సీ పన్ను, వాణి కపూర్, ఫర్దీన్ ఖాన్, అమ్మీ విర్క్, ఆదిత్య సీల్ సహ తారాగణం. ఈ సినిమా తర్వాత ప్రగ్య ఎన్బీకే 109లో నటిస్తోందని, 'అఖండ 2'లోను బోయపాటి అవకాశం కల్పిస్తున్నారని ప్రచారమవుతోంది. కానీ దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.




# అదానీ, రేవంత్.. మధ్యలో రాహుల్.. చర్చకు దారితీసిన ఫ్లెక్సీ

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కులగణన మీదే రాజకీయాలు నడుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కులగణన చేపడుతోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సర్వేను ప్రారంభిస్తోంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మొత్తంగా 48వేల మంది సిబ్బంది ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తోంది. 75 ప్రశ్నలతో సిబ్బంది వివరాలను సేకరించబోతున్నారు. ఎన్నికల సందర్భంలో కులగణన చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రచారం చేపట్టింది. దాంతో చెప్పినట్లుగానే ఇప్పుడు సర్వే చేపడుతోంది. అయితే.. సర్వేకు ముందే ఈ రోజు పలువురు మేధావులు, పౌరహక్కులు, ప్రజాసంఘాల నాయకులు, కులసంఘాలతో బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతున్నారు. అయితే.. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు హాజరవుతున్న రాహుల్ కోసం నగరంలో ఫ్లెక్సీలు వెలిశాయి. కాగా.. అందులో అదానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి రాహుల్‌కు స్వాగతం చెబుతున్నట్లుగా ఉన్న ఫ్లెక్సీలు ఇప్పుడు కలకలం సృష్టించాయి. ప్రస్తుతం ఆ ఫ్లెక్సీలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వైఖరికి వ్యతిరేకంగా ఇటీవల రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించింది. అంతేకాదు.. ఇటీవల అదానీ సైతం రూ.100 కోట్ల విరాళం సైతం అందించారు. మరోవైపు.. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం మోడీతో అదానీకి ముడిపెడుతూ నిత్యం విమర్శలు చేస్తూనే ఉంది. దేశాన్ని అదానీకి దోచిపెడుతున్నారని రాహుల్ ఎన్నో సందర్భాల్లో విమర్శలు చేశారు. కానీ.. రాష్ట్రానికి వచ్చేసరికి పరిస్థితి విభిన్నంగా ఉంది. దాంతో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై నిలదీస్తున్నాయి. ఇదే క్రమంలో రాహుల్ గాంధీకి స్వాగతం చెబుతూ అదానీ, రేవంత్‌తో కలిసి ఉన్న ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై మరింత గందరగోళానికి దారితీసింది.

# అగ్ర కులాలకు నిమ్న కులాల వారు కనిపించరు.. రాహుల్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణలో కులగణనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని రాహుల్ అన్నారు. కులాల వారీగా జనాభా లెక్కిస్తే తరాలుగా నష్టపోతున్న వారికి తగిన ప్రాతినిధ్యం దొరుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో కులగణనకు సంబంధించి పౌరహక్కులు, మేధావులతో నిర్వహించిన సభలో రాహుల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భారతదేశంలో కులవ్యవస్థ చాల బలంగా ఉందని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ అనేది కనిపించదని చెప్పారు. కులగణన ద్వారా ఏళ్లుగా నష్టపోతున్న వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కుల వ్యవస్థ అన్ని రంగాల్లో ఉందని.. రాజకీయ, న్యాయ వ్యవస్థలోనూ అది బలంగా పాతుకుపోయిందని చెప్పుకొచ్చారు. కుల వ్యవస్థ అనేది కొంత మంది ఆత్మ విశ్వాసం దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల యువత సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పారు. ప్రపంచంలో



ఎక్కడా లేని ఈ కులవ్యవస్థ ఇండియాలోనే ఉందని రాహుల్ మండిపడ్డారు. కుల వివక్షత వల్ల ఎంత ఇబ్బంది ఉంటుందో అర్థం చేసుకోగలనని చెప్పారు. దేశం ఆర్థికంగా ఎదగాలంటే దాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, ప్రొఫెసర్లు కులగణనపై మాట్లాడి సూచనలు చేశారు. ప్రొఫెసర్లు చెప్పిన విషయాలను రాహుల్ గాంధీ స్వయంగా నోట్ చేసుకున్నారు.

# ఆహారాన్ని కల్తీ చేస్తే వదిలేది లేదు.. కఠిన చర్యలుంటాయ్: దామోదర రాజనర్సింహ

హైదరాబాద్: ఆహారాన్ని కల్తీ చేసేందుకు ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని.. కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హెచ్చరించారు. నగరంలోని వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ శివలీల, జీహెచ్‌ఎంసీ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. వ్యాపారం చేసుకునే వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. వసతి గృహాల్లో పిల్లలకు



మంచి భోజనం పెట్టకుండా ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెరిగిన హోటళ్ల సంఖ్య, జనాభాకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచనున్నట్టు మంత్రి ప్రకటించారు.

# రాహుల్.. అ'శోక' నగర్‌ను సందర్శించండి: హరీశ్‌రావు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం, రాహుల్ గాంధీపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైరయ్యారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువతను తప్పుదోవ పట్టించిందని విమర్శించారు. రాహుల్.. ఎన్నికల ముందు మీరు నిరుద్యోగ యువతను కలిసిన ప్రదేశంలోనే విద్యార్థులను మీ ప్రజా ప్రభుత్వం కొట్టిందని మీకు తెలుసా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వస్తున్న మీరు ఒకసారి అశోక్‌నగర్‌ను సదర్శించి ఆ విద్యార్థులతో మాట్లాడాలని, వారి ఆవేదను వినాలని, అ'శోక' నగరంగా మార్చిన మీ ప్రభుత్వ తీరును చూడాలన్నారు. మీరు వాగ్దానం చేసిన 20 లక్షల ఉద్యోగాల్లో కనీసం 10 శాతం కూడా భర్తీ చేయలేదని చెప్పారు. టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు, ఆ సంగతి దేవుడెరుగు.. టీఎస్పీఎస్సీని టీజీపీఎస్‌గా పేరు మార్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు, కానీ అది కేవలం జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మిగిలిపోయిందన్నారు. పది నెలల కాలంలో నిరుద్యోగ భృతి, యువ వికాసం కింద ఇస్తామన్న రూ.5 లక్షల వంటి



హామీ ఖాళీ గ్యారంటీగా మారడంతో తెలంగాణ యువతకు అభద్రతాభావం ఏర్పడిందని చెప్పారు. నిరుద్యోగుల పట్ల, విద్యార్థుల పట్ల మీరు, మీ పార్టీ చూపిన కపట ప్రేమ బట్టబయలైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశ పాలనను నిరుద్యోగ యువత తప్పకుండా గుర్తుపెట్టుకుంటుందని మండిపడ్డారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి వంగలపూడి అనిత

అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. పవన్ కల్యాణ్ మాటలను బాధ్యతగా తీసుకొని కలిసి పనిచేస్తామని వంగలపూడి అనిత పేర్కొన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా పోలీసుల అధికారులతో హోం మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. 'మహిళలపై అఘాయిత్యాలు, గంజాయి వంటి అంశాలపై సమీక్షలో చర్చించాం. నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాం. శ్రీ సత్యసాయి జిల్లాలో గ్యాంగ్ రేప్ బాధాకరం. ఇలాంటి వారిపై గతంలోనే చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు ఇలాంటివి జరిగేవి కావు. గతంలో రాజకీయంగా నేరాలు ప్రోత్సహించారు. రాష్ట్రంలో జరుగుతున్న నేరాల విషయంలో అందరికీ బాధ ఉంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బయట పడ్డారు.. మేము పడలేదు. లా అండ్ ఆర్డర్ పకడ్బందిగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం. శిక్షలు తక్షణం అమలు చేయడానికి ప్రత్యేక కోర్టులు కావాలి. ఇలాంటి అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నవారిపై చర్యలుంటాయి. వైకాపా పాలనలో పోలీసులు ఇబ్బందులు పడ్డారు. జగన్‌కు భావప్రకటన స్వేచ్ఛ ఇప్పుడు గుర్తుకు వచ్చిందా?' అని హోంమంత్రి అనిత అన్నారు. సోమవారం ఉదయం కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడారు. 'నేను అడగలేక కాదు.. హోంశాఖ తీసుకోలేక కాదు.. నేను హోంశాఖ తీసుకుంటే పరిస్థితులు వేరుగా ఉంటాయి. మమ్మల్ని విమర్శించే నాయకులందరికీ నేను ఈ రోజు చెబుతున్నా. ఇలాగే ఏమీ చేయకుండా నిశ్చలంగా ఉండండి. హోం బాధ్యతలు కూడా తీసుకోవాల్సి వస్తుంది.. గుర్తుపెట్టుకోండి.' అని పవన్ పేర్కొన్నారు.






# అంగన్ వాడీలకు శుభవార్త చెప్పిన మంత్రి సీతక్క..!

హైదరాబాద్ : పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అంగన్ వాడీలకు శుభవార్త చెప్పారు. అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లకు బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 35,700 అంగన్ వాడీ కేంద్రాల్లోపని చేస్తున్న టీచర్లు, హెల్పర్లకు ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సీతక్క సమీక్ష నిర్వహించారు. క్వాలిటీ చీరలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంగన్ వాడీ సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. అమ్మలాగా చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లను కొనియాడారు. ఆర్థిక సమస్యలతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి వివరించారు. అయినప్పటికీ అంగన్ వాడీ సమస్యలన్నిటికీ పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. రిటర్మెంట్ బెనిఫిట్స్ సాంకేతిక సమస్యలతో ఆలస్యం అయ్యాయని ఎవరు బాధ పడాల్సి అవసరం లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పై పది రోజుల్లో జీవో వస్తుందని ప్రకటించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్ వాడీ కేంద్రాలకు సొంత బిల్డింగ్ లు నిర్మిస్తామని తెలిపారు. అంగన్ వాడీలకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామని వివరించారు. 16 ఏళ్ల తర్వాత పాఠశాల, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు, ఏడేళ్ల తర్వాత డైట్ ఛార్జీలను 40% పెంచినట్లు మంత్రి గుర్తు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులందరికీ విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యావేత్తలు ఉంటే కుటుంబం, గ్రామం, సమాజం అభివృద్ధి బాటలో పయనిస్తుందని చెప్పారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకుని, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని గుర్తు చేస్తున్నారు. గిరిజన విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. తాను ఏ శాఖలో ఉన్నా తన మనసు గిరిజన సంక్షేమం పరితపిస్తుందని పేర్కొన్నారు. తన ప్రాణం ఆదివాసీ, గిరిజనులు, చెంచుల గురించి కొట్టుకుంటుందని వివరించారు. ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సంపాదించిన పలువురు విద్యార్థులకు మంత్రి సీతక్క ల్యాప్ టాప్‌లు అందజేశారు.



# హైదరాబాద్‌లో సామూహిక అత్యాచారం

హైదరాబాద్: మధురానగర్ పరిధిలో ఓ మహిళపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ముగ్గురు యువకులు తనపై అత్యాచారం చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పని ముగించుకుని వస్తుండగా మాయమాటలు చెప్పి తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

# ఆటో డ్రైవర్ల బాధలు కలచివేశాయి: కేటీఆర్..




హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల జీవితాలు అస్తవ్యస్తం అయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్ల పరిస్థితి ఇలాగే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఆటో డ్రైవర్లు చేపట్టిన నిరసన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న నిరసన దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. " తెలంగాణకు ఇవాళ రాహుల్ గాంధీ వస్తున్నారు. ఇదే రాహుల్ గాంధీ గతేడాది ఎన్నికల వేళ ఆటోల్లో తిరిగి రాష్ట్ర ప్రజలకు చాలా హామీలు ఇచ్చారు. కానీ ఒక్క హామీ నెరవేర్చలేదు. ఇంటింటికీ సంక్షేమం అని చెప్పారు. అత్తలు, కోడళ్లకు డబ్బులు ఇస్తామని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. కానీ దాని వల్ల ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. డ్రైవర్ల ఆత్మహత్యలు, వారి ఇబ్బందుల గురించిన వివరాలను అసెంబ్లీలో పెడితే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు మమ్మల్ని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5వేలు ఇవ్వాలి. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్స్యూరెన్స్ ప్రభుత్వమే అందించాలి. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ఇన్స్యూరెన్సు కూడా రద్దు చేశారు. మీ కోసం వచ్చిన వాళ్లకు వ్యతిరేకంగా మీరు మాట్లాడటం సరైనది కాదు. నేను ఇక్కడికి ఆటోలోనే వచ్చాను. డ్రైవరన్న తమ బాధలు చెప్తుంటే ఎంతో ఆవేదన కలిగింది. బీఆర్ఎస్‌కు ఆటో డ్రైవర్ల కెపాసిటీ తెలుసు. మమ్మల్ని ఓడగొట్టడంలో మీ పాత్ర ఉంది. ఇంకా నాలుగేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భరించాలి. ఈ నాలుగేళ్లు ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం. అన్ని జెండాలు ఒక్కటై పోరాటం చేయాలి. ఏఐటీయూసీ ప్రభుత్వంతో కలిసి ఉంది, అయినా ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు రోడ్డెక్కింది. సీఐటీయూ వంటి సంఘాలూ ఉద్యమాలు చేస్తున్నాయి. కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలి. మా పూర్తి మద్దతు మీకు ఇస్తున్నాం. మా బీఆర్‌టీయూ సంఘంతో కలిసి మీరు చేసే ప్రతి పోరాటంలో తోడుగా ఉంటాం. ఇక్కడికి పోలీసులు కూడా ఎక్కువ మంది రాకుండా కట్టడి చేశారు. పోలీసులూ కష్టాల్లోనే ఉన్నారు. వాళ్లూ సమస్యలతో రోడ్డెక్కారు. పోలీసులు డ్యూటీ చేయాలి, కానీ పేదల పట్ల కనీసం ఆలోచన చేయాలి. పోలీసులను సీఎం నమ్మడం లేదు. అందుకే సచివాలయంలో స్పెషల్ పోలీసులను తీసేసి బెటాలియన్ దింపారు" అని చెప్పారు. కాగా, మహాలక్ష్మి పథకం వల్ల నష్టపోయామంటూ ఇందిరా పార్కు వద్ద ఆటోడ్రైవర్లు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని, తాము నష్టపోయినందుకు నెలకు రూ.15 వేలు చొప్పున ఇవ్వాలంటూ ఆటోడ్రైవర్లు ధర్నా చేపట్టారు. అలాగే హైదరాబాద్‌లో కొత్తగా 20 వేల ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని, మీటర్ చార్జీలు సైతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది.

**కేటీఆర్‌కు చేదు అనుభవం..** మహాధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, ముఠా గోపాల్‌కు చేదు అనుభవం ఎదురైంది. కేటీఆర్ కంటే ముందుగా ముఠా గోపాల్ అక్కడికి చేరుకున్నారు. అయితే ధర్నాలో పాల్గొనాలని తాము రాజకీయ నాయకులను పిలవలేదని, కొంతమంది ధర్నాను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని డ్రైవర్లు మండిపడ్డారు. తమను ప్రశాంతంగా ధర్నా చేసుకోనివ్వాలని చెప్పడంతో ఎమ్మెల్యే ముఠా గోపాల్ అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

అలాగే కేటీఆర్ విషయంలో వారు ఇలాగే స్పందించారు. "మిమ్మల్ని రమ్మని ఎవరు పిలిచారు. మీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే ఊబర్, ఓలాలు వచ్చాయి. మీ ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లకు ఏం చేశారు? చలానాలు పెంచారు, వందల కేసులు పెట్టారు. కొత్త ఆటోలకి పర్మిషన్లు ఇవ్వలేదు. ఏ మొహం పెట్టుకొని వచ్చి మాట్లాడాలని చూస్తున్నారు" అని డ్రైవర్లు ప్రశ్నించారు. దీంతో ఆయన వారిని సముదాయించి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యూపీ మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమే: సుప్రీంకోర్టు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో వేల సంఖ్యలో ఉన్న మదర్సాలకు భారీ ఊరట లభించింది. యూపీ మదర్సా ఎడ్యుకేషన్ చట్టం రాజ్యాంగబద్ధమేనని మంగళవారం సుప్రీంకోర్టు కీలకతీర్పు వెలువరించింది. ఈ చట్టాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం.. గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఉత్తరప్రదేశ్ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు దానిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అది లౌకికవాద భావనకు విరుద్ధమైనదని ఆ సందర్భంగా తెలిపింది. దాంతో ఆ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని తెలిపింది. ఈ తీర్పు 10వేల మదర్సా టీచర్లు, 17 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతోందని అప్పట్లో పేర్కొంది. ప్రస్తుత తీర్పుతో 16వేల మదర్సాల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com